జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 5 సంచిక 40 | హైదరాబాద్, నవంబరు 30 మంగళవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

### దేశ ప్రయోజనాల కోసం శాంతియుతంగా..

## చర్చించుకుందాం: మోడీ

### ప్రభుత్వం ప్రతి అంశంపై చర్చకు సిద్ధం..



దిల్లీ,నవంబరు 29 ప్రజాపాలన ప్రతినిధి: పార్లమెంటులో అన్ని ప్రశ్నలను ఎదుర్కొని, సమాధానం చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. అయితే సభ గౌరవాన్ని, సభాపతి సమగ్రతను, హుందాతనాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ మీడియతో మాట్లాడారు. ప్రతి ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. పార్లమెంటులో ప్రశ్నోత్తరాలు, శాంతి నెలకొనాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. దేశంలోని ప్రతి సామాన్య పౌరుడు ఈ పార్లమెంటు సమావేశాలు గమనిస్తారని, వారి మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంటు దేశ ప్రయోజనాల కోసం చర్చలు జరపాలని, దేశాభివృద్ధి కొరకు కొత్త మార్గాలను కనుగొనాలని ప్రధాని అన్నారు. ఈ పార్లమెంటు సభా కార్యకలాపాలు సజావుగా జరగాలని కోరుకుంటున్నట్లు మోడీ తెలిపారు. ఈ సమావేశాల్లో సకారాత్మక కృషి జరగడం ముఖ్యమని చెప్పారు. పార్లమెంటులో చర్చించాలని, (మిగతా 2లో..)

### యాసంగిలో...

## వరి కొనుగోలు కేంద్రాలు ఉండవు: కేసీఆర్



హైదరాబాద్,నవంబరు 29 ప్రజాపాలన ప్రతినిధి: యాసంగిలో వరి కొనుగోలు కేంద్రాలు ఉండవని సీఎం కేసీఆర్ తెలిపారు. బాయిల్డ్ రైస్ కొనమని కేంద్రం చెప్పడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. బీజేపీని నమ్ముకుంటే సర్వనాశనం కావ్వాల్సిందేనన్నారు. మత చిచ్చు పెట్టి దేశ సమగ్రతను దెబ్బతీస్తారని చెప్పారు. దేశంలో విభజన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏడేళ్లలో బీజేపీ ఏ రంగానికి మేలు చేసిందో చెప్పాలన్నారు. రైతులు బాగుపడాలంటే బీజేపీ ప్రభుత్వం పోవాలని వ్యాఖ్యానించారు. గత రెండేళ్లలో దేశంలో భయంకరంగా పేదరికం పెరిగిందని చెప్పారు. కేంద్రం పవర్ రిఫామ్స్ పేరుతో రాష్ట్రం మెడమీద కత్తి పెడుతోందని తెలిపారు. ప్రతి బోర్ దగ్గర మీటర్లు పెట్టాలని కేంద్రం ఆదేశించిందని పేర్కొన్నారు. కేంద్రం దుష్ట పాలనతో దేశంలో ఆకలి కేకలు పెరిగాయన్నారు. కేంద్రానికి సామాజిక బాధ్యత ఉంటే ధాన్యం కొనాలని కేసీఆర్ డిమాండ్ చేశారు.

**కేంద్రానికి ఇంతనన్న సిగ్గుండాలి**

బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్ కంటే దారుణమైన స్థానంలో భారత్ ఉంది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 116 దేశాల్లో 101వ స్థానం భారత్‌ది. కేంద్రమంత్రి పియూష్ గోయల్ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. దేశంలో నకిలీ విత్తనాలపై పీడీయాక్ట్ తెచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులను 100శాతం ముంచుతుంది. బీజేపీ నేతలు రైతులను అయోమయానికి గురిచేస్తున్నారు. 750 మంది రైతుల్ని పొట్టనబెట్టుకున్న హంతక పార్టీ బీజేపీ. సీఎం కేసీఆర్ కేంద్రానికి ఇంతనన్న సిగ్గుండాలి వ్యాఖ్యానించారు.



### మమ్మల్ని సస్పెండ్ చేసినందుకు ఆనందంగా ఉంది: టీఎంసీ ఎంపీ

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాల ప్రారంభం రోజునే 12 మంది సభ్యులు రాజ్యసభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అయితే ఇలా సస్పెండ్ అవ్వడం ఆనందంగా ఉందని సస్పెన్షన్‌కు గురైన సభ్యుల్లో ఒకరైన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ శాంతా ఛెత్రి అన్నారు. ప్రభుత్వ నియంతృత్వంతో పాటు దేశం కోసం పని చేస్తున్న వారెవరో ప్రజలకు తెలుస్తుందని ఆమె అన్నారు. పార్లమెంట్‌లో సాగు చట్టాల ఉపసంహరణ బిల్లుపై ఎలాంటి చర్చ జరగకపోవడాన్ని ప్రస్తావిస్తూ (మిగతా 2లో..)

### రాజ్యసభలో 12మంది ఎంపీలపై..

## సస్పెన్షన్ వేటు!



దిల్లీ,నవంబరు 29 ప్రజాపాలన ప్రతినిధి: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే పలువురు విపక్ష ఎంపీలకు రాజ్యసభలో గట్టి షాక్ తగిలింది. గత వర్షాకాల సమావేశాల్లో సభలో అనుచితంగా, హింసాత్మక ధోరణితో ప్రవర్తించినపలువురు ఎంపీలపై రాజ్యసభ క్రమశిక్షణా చర్యల కింద వేటు వేసింది. ఈ మేరకు కాంగ్రెస్ సహా పలు పార్టీలకు చెందిన 12మంది ఎంపీలను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం ప్రారంభమైన ఈశీతాకాల సమావేశాలు ముగిసేవరకూవారిపై సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. సస్పెండ్ అయిన ఎంపీల్లో కాంగ్రెస్‌కు చెందిన సభ్యులు ఆరుగురు ఉండగా..శివసేన, తృణమూల్ కాంగ్రెస్ నుంచి చెరో ఇద్దరు, సీపీఐ, సీపీఎం నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు.

**సస్పెండ్ అయిన 12మంది సభ్యులు వీరే..**

ఫూలోదేవి నేతం (కాంగ్రెస్), ఛాయా వర్మ (కాంగ్రెస్), రిపున్ బోరా (కాంగ్రెస్), రాజామణి పటేల్ (కాంగ్రెస్), అఖిలేశ్ ప్రసాద్ సింగ్ (కాంగ్రెస్), సయ్యద్ నాసిర్ హుస్సేన్ (కాంగ్రెస్), డోలా సేన్ (తృణమూల్), శాంతా ఛత్రీ (తృణమూల్), (మిగతా 2లో..)

## కర్ణాటక ముఖ్యమంత్రిని మళ్లీ మార్చనున్న బీజేపీ!





బెంగళూరు,నవంబరు 29 ప్రజాపాలన ప్రతినిధి: కర్ణాటక ముఖ్యమంత్రిని మరోసారి మార్చనున్నట్లు ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప అన్నారు. అయితే ఆ ముఖ్యమంత్రి ఎవరో కూడా ఆయనే చెప్పారు. కర్ణాటక మంత్రి మురుగేష్ నిరాని తొందరలోనే సీఎం అవుతారని, అయితే ఇది ఎప్పుడు జరుగుతుందనేది తాను స్పష్టంగా చెప్పలేనని అన్నారు. బస్వరాజ్ బొమ్మై కేబినెట్‌లో కేఎస్ ఈశ్వరప్ప గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇక నిరాని భారీ, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రిగా విధులు నిర్వహిస్తున్నారు. (మిగతా 2లో..)

## వివాదాస్పద సాగు చట్టాల రద్దు బిల్లుకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ : వివాదాస్పద సాగు చట్టాల రద్దు బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లును వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ సభ్యుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ఈ బిల్లుపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. దీనిపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ, ప్రతిపక్ష సభ్యులు వెల్‌లో నుంచి బయటికి వచ్చి, తమ తమ స్థానాల్లో కూర్చుంటే చర్చకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. సభ కార్యకలాపాలు సజావుగా జరగడానికి వీలుగా సభ్యులు సహకరించాలని కోరారు. చివరికి ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య, మూజువాణి ఓటుతో ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. అనంతరం సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. దీంతో సుమారు ఓ సంవత్సరం నుంచి ఈ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న రైతులు విజయం సాధించారు.

## ఇతర దేశాలకూ కొవాగ్జిన్.. ఎగుమతులు ప్రారంభించిన భారత్ బయోటెక్




హైదరాబాద్ నవంబరు 29 ప్రజాపాలన ప్రతినిధి: హైదరాబాద్ ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్ సంస్థ కరోనా వ్యాక్సిన్ కొవాగ్జిన్ ఎగుమతులను ప్రారంభించింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న విదేశీ ఆర్డర్ల ఎగుమతిని ఈ నెలలో చేపట్టినట్లు భారత్ బయోటెక్ సోమవారం వెల్లడించింది. డిసెంబర్‌లో ఎగుమతిని మరింతగా పెంచుతామని ఫార్మా కంపెనీ తెలిపింది. ఇప్పటికే కొవాగ్జిన్ అత్యవసర వినియోగానికి చాలా దేశాలు అనుమతి ఇచ్చాయని ఈ నేపథ్యంలో డిసెంబర్ నెలలో వాటికి కూడా ఎగుమతులు ప్రారంభించనున్నట్లు భారత్ బయోటెక్ ప్రకటనలో వెల్లడించింది. ఇటీవలనే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కొవాగ్జిన్ అత్యవసర వినియోగానికి ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అనంతరం అగ్రరాజ్యం అమెరికా సహా పలు దేశాలు కొవాగ్జిన్‌కు అనుమతినిచ్చాయి. దీంతోపాటు.. ఆయా దేశాలకు కొవాగ్జిన్ సరఫరా చేయాలంటూ భారత్ బయోటెక్ కంపెనీకి ఆర్డర్లు సైతం వచ్చాయి. దీనిలో భాగంగా భారత్ బయోటెక్ కంపెనీ వ్యాక్సిన్ల ఎగుమతులను ప్రారంభించింది. డిసెంబర్ నెలలో చాలా దేశాలకు ఎగుమతులు చేయనున్నట్లు భారత్ బయోటెక్ వెల్లడించింది.




స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్
కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్




గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం
కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల
కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# పాఠశాలల బాధ్యత పంచాయతీలదే

## ఇకపై ఆర్థిక సంఘం నిధులతో వసతులు మరమ్మతులు

బోనకల్, నవంబర్ 29 ప్రజా పాలన ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా వాటి బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీలకు అప్పగించింది. మౌలిక వసతులు, మరమ్మతులు చేయించడానికి వీలుగా 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించుకోవచ్చని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి నెల విడుదలయ్యే నిధుల నుంచి అవసరాన్ని బట్టి వెచ్చించుకోవచ్చని సూచించింది. ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడులకు అవసరమైన వసతులు, మరమ్మతులు పంచాయతీలు చేపట్టనున్నాయి. పంచాయతీలకు పాఠశాలల అభివృద్ధి బాధ్యతలు అప్పగించడం బాగానే ఉన్నా పాలకవర్గాలు ఏ మేరకు నిధులు వెచ్చిస్తారో చూడాలి. ప్రస్తుతం వస్తున్న ఆర్థిక సంఘ నిధుల్లో 20శాతం విద్యుత్తు బిల్లులకు, 30శాతం ఇతర అవసరాలకు వెచ్చిస్తున్నారు. మిగిలిన 50శాతంతో అటు గ్రామాభివృద్ధి పనులు, ఇటు పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే సర్పంచులు ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవడం లేదని అంటున్నారు. చిన్న పంచాయతీల్లో ట్రాక్టర్ల వాయిదాలు చెల్లించడానికే సరిపోతున్నాయని చెబుతున్నారు. పంచాయతీలు పాఠశాలల అభివృద్ధి దశలవారీగా చేపడితే మేలు,ముందుగా పాలకవర్గాలు, విద్యాకమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు కలిసి సమస్యలు గుర్తించాలి. అందులో అత్యవసరమైనవి ముందుగా పూర్తి చేసుకుంటూ వెళితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య బాగా



పెరిగింది. నిర్వహణకు నిధులు సక్రమంగా రావడం లేదు. జిల్లావ్యాప్తంగా 2,318 పాఠశాలలు ఉండగా అనేక చోట్ల వివిధ రకాల సమస్యలు ఉన్నాయి. ఈ క్రమంలో పంచాయతీ పాలకవర్గాలు, గ్రామస్థులు, విద్యా కమిటీలు కలిసి వివిధ రకాల పనులు చేయొచ్చని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పేర్కొంది. విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించడం, లీకేజీలు లేని పైపులైన్లు నిర్మాణం, చేతులు కడుక్కోవడానికి హ్యాండ్‌వాష్ యూనిట్ నిర్మాణం. బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం. శానిటరీ ప్యాడ్ల తయారీకి, వినియోగించిన తరువాత దహనం చేయడానికి అవసరమైన యంత్రాలు సమకూర్చడం ,దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక మరుగుదొడ్ల, ర్యాంపుల నిర్మాణం, మధ్యాహ్న భోజనం కోసం వంటశాలల్లో వసతులు సమకూర్చడం, షెడ్లు నిర్మించడం, పెరటి తోటల పెంపకం, విద్యుత్తు కనెక్షన్లు, లైన్లు సక్రమంగా చేసుకోవాలి. అవసరమైతే కొత్త తీగలు ఏర్పాటు చేసి మెరుగైన విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలి. భారత్ నెట్ వైఫై సౌకర్యం కల్పించాలి. తరగతి గదులు, మరుగుదొడ్ల ఫ్లోరింగ్ చేయించాలి.

తలుపులు, కిటికీలు, ఫర్నిచర్, ప్రహరీలకు అవసరమైతే మరమ్మతులు చేయించాలి. మైదానం ఉంటే అభివృద్ధి చేయాలి. క్యాచ్ ది రెయిన్ కాంపెనింగ్‌లో భాగంగా పాఠశాల భవనంపై పడిన వర్షం నీటిని భూగర్భంలోకి పంపించడానికి ఇంకుడు గుంతలు నిర్మించాలి.

## ఎర్రుపాలెం మండలం నూతన ఎస్ ఐ ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన మండల టిడిపి అధ్యక్షులు



ఎర్రుపాలెం నవంబర్ 28 ప్రజా పాలన : ఎర్రుపాలెం మండలంలో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వేడ ప్రసాద్ ని మండలం టిడిపి అధ్యక్షులు శ్రీ దోమందుల సామేలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సెక్రటరీ శ్రీ గురజాల సత్యనారాయణ, సర్పంచ్ గోసు రామారావు, రామకృష్ణా రెడ్డి,గూడూరు వెంకటేశ్వర్ రెడ్డి, దేవరకొండ మోహన్ రావు, మరియు చిట్టిబొమ్మల శ్రీనివాస రావు.

## ఛలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం: శనిగారపు మురళీ కృష్ణమాదిగ



మందమర్రి నవంబర్ 29 ప్రజాపాలన ప్రతినిది: మాదిగ పోరాట సమితి(ఎం ఆర్ పి ఎస్) అనుబంద సంఘం (ఎం ఎస్ ఎఫ్) విద్యార్థి మహాసభను మందకృష్ణ మాదిగ నాయకత్వంలో డిల్లీలో నిర్వహించబో సభను విజవంతం చేద్దాం అని ఆయన మందమర్రి ప్రస్ క్లబ్ లో నిర్వహించిన కార్యక్రమంలో పిలుపు నిచ్చారు. మందమర్రి ప్రస్ క్లబ్ లో జీడి సారంగం మాదిగ ఎం ఆర్ పి ఎస్ పట్టణ అద్యక్ష్యుడు అద్యక్షతన జరిగిన ప్రెస్ మీట్ కు చెన్నూర్ ఎం ఎస్ ఎఫ్ ఇంచార్జి శనిగారపు మురళీ కృష్ణమాదిగ హాజరై మాట్లాడుతూ ఎస్ సి వర్గీకరణ బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లుకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేసారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటాను నిలుపుకోవాలని ఎస్ ల సామాజిక న్యాయమైన హక్కుల్ని అందించాలని డిమాండ్ చేస్తూ నియోజక వర్గంలోని మండలల్లోని మాదిగ ఉప కులవిద్యార్దులను చైతన్య పర్చి డిల్లిసభను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పెర్క నర్సయ్య, రామగిరి రాజలింగు, సిరికొండ సది, రత్నం మొగిలి, కాంపెల్లి కుమార్, కర్రావుల క్రిష్ణ గోపాల తదితరులు హాజరైయ్యారు.

# మద్దెల శివ కుమార్ కు అత్యంత సన్నిహితుడైన ప్రముఖ సినీ నృత్య దర్శకుడు నటుడు

## జాతీయ అవార్డు గ్రహీత కె శివ శంకర్ మాస్టర్ అకాల మృతికి తీవ్ర దిగ్భ్రాంతికి లోనై కన్నీటిపర్యంతమైన మద్దెల!




భద్రాద్రి కొత్తగూడెం, నవంబరు 29 ప్రజాపాలన ప్రతినిధి: మద్దెల సారథ్యంలో నిర్వహించబడుతున్న తెలంగాణ బాలోత్సవ్4ం2017 కు విశిష్ట అతిథిగా హాజరై అందరినీ అలరించిన స్వర్గీయ శివ శంకర్ మాస్టర్! స్వర్గీయ శివ శంకర్ మాస్టర్ అకాల మృతి అటు కళారంగానికి ఇటు సినీ రంగానికి తీరని లోటు! అభ్యుదయ కళా సేవ సమితి జిల్లా అధ్యక్షుడు మద్దెల శివ కుమార్ శాస్త్రీయ నృత్యంలో ఎంతో నిష్ణాతులై ఆ ప్రతిభను సినీ నృత్యాలకు అనువయింప చేసుకొని దాదాపు అందరు హీరోలతో తనదైన విన్నూత్న స్టెప్పులతో ముద్ర వేయించి దాదాపు పది భాషల్లో ఎనిమిది వందల చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించడమే కాకుండా దాదాపు ముప్పై సినిమాలలో తన అద్భుతమైన నటనతో అందరినీ అలరించి ఎన్నో జాతీయ రాష్ట్ర అవార్డులను సొంతం చేసుకొని కళామతల్లి ముద్దుబిడ్డ గా ఎందరో శిష్యులను తీర్చిదిద్దిన మహా కళాకారుడు మహా మనీషి స్వర్గీయ కె శివ శంకర్ మాస్టర్ (72) అకాల మృతి అటు కళారంగానికి ఇటు సినీరంగానికి తీరని లోటు అని అభ్యుదయ కళా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కవి సినీ గీతరచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ మద్దెల శివ కుమార్ ఉద్ఘాటించారు. కరోనా బారిన పడి హైదరాబాద్లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ ఆదివారం మధ్యాహ్నం అకాల మృతి చెందిన తనకు అత్యంత సన్నిహితుడైన శివ శంకర్ మాస్టర్ కు నివాళిగా మద్దెల 29 11 2021 నాడు ఒక ప్రత్యేక ప్రకటనను అటు పాత్రికేయసోదరులకు ఇటు సోషల్ మీడియాకు విడుదల చేశారు. తెలుగులో ఖైదీ అమ్మోరు సూర్యవంశం అరుంధతి యమదొంగ మగధీర లాంటి సూపర్ డూపర్ హిట్ చిత్రాలలో సూపర్ హిట్ పాటలకు శివ శంకర్ మాస్టర్ తన అద్భుతమైన కొరియోగ్రఫీ అందించారు. మెగాస్టార్ చిరంజీవి గారికి ఖైదీ చిత్రం లో రగులుతుంది మొగలి పొద అనే సూపర్ హిట్ పాటకు నృత్య దర్శకత్వం వహించడమే కాకుండా చిరంజీవి మానస పుత్రుడైన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కు మగధీర చిత్రంలో వేలాది మంది ఆర్టిస్టులతో అద్భుతంగా నృత్య దర్శకత్వం వహించి చిత్రీకరించిన ధీర ధీర ధీర అనే సూపర్ హిట్ పాటకు జాతీయ అవార్డు కూడా కైవసం చేసుకున్నారని మద్దెల ప్రశంసించారు.

శివ శంకర్ మాస్టర్ కు మద్దెల తో అనుబంధం!

మద్దెల కు కళారంగంలో అత్యంత సన్నిహితుడైన సత్తుపల్లి కి చెందిన అంతర్జాతీయ జానపద బ్రహ్మ బొమ్మ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి 2012 న మద్దెల అత్యంత ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును చెన్నైలో స్వీకరించినప్పుడు శివ శంకర్ మాస్టర్ కు అత్యంత సన్నిహితుడైన ప్రియ శిష్యుడు బొమ్మ రెడ్డి మద్దెల ను చెన్నై లోని శివ శంకర్ మాస్టర్ ఇంటికి తీసుకుని వెళ్లి పరిచయం చేశారు శివ శంకర్ మాస్టర్ వీరికి భోజన ఆతిథ్యాన్ని కూడా అందించారు అప్పటి తో పెనవేసుకున్న అనుబంధం ఇంతింతై వటుడింతై అన్నట్లుగా శివ శంకర్ మాస్టర్ ను కొత్తగూడెం లోని తెలంగాణ బాలోత్సవ్ తీసుకుని వచ్చింది. మద్దెల ఆ యొక్క అనుబంధాన్ని స్మరించుకుంటూ శివ శంకర్ మాస్టర్ గొప్ప కళాకారుడే కాకుండా గొప్ప వ్యక్తిత్వం గల మహా మనిషి అని ప్రేమ దాతృత్వం దయ విధేయత మూర్తీభవించిన మానవత్వపు విలువలను పరిమళింప చేసే మహానుభావుడని మద్దెల కొనియాడారు. శివ శంకర్ మాస్టర్ తనను ఎప్పుడూ మాస్టారు మాస్టారు అని పిలుస్తూ ఎంతో గౌరవించే వారని శివ కుమార్ మాస్టర్ కు గొప్ప టాలెంట్స్ ఉన్నాయని మంచితనం మానవత్వం ప్రేమ స్నేహం విధేయత దయార్థ హృదయం కఠోర పరిశ్రమ యాగం సేవా తత్ప రతలు గల బహుముఖ ప్రజ్ఞాశాలి అని అభినందించే వారని మద్దెల ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలంగాణ బాలోత్సవ్ 4ం 2017 కు విశిష్ట అతిథిగా హాజరైన శివ శంకర్ మాస్టర్ జటాయువు మోక్షం అనే అద్భుతమైన నృత్య రూపకాన్ని అలవోకగా ప్రదర్శించి అందరినీ అలరించడమే కాకుండా మానవతా విలువలతో కూడిన సందేశాన్ని కూడా ఇవ్వడం జరిగిందని మద్దెల గుర్తు చేసుకున్నారు. ఈ విధంగా అటు కళారంగానికి ఇటు సినీరంగానికి తనదైన విశిష్ట సేవలు అందించడమే కాకుండా ఎంతో మంది శిష్యులను కూడా తయారుచేసి ఈనాడు సినీ రంగంలో అగ్రగామిగా నిలిపార ని ఎన్నో సీరియల్స్ మరియు స్టేజ్ షోల ద్వారా న్యాయనిర్ణేతగా వ్యవహరించిఎందరికో స్ఫూర్తినిచ్చి తన జన్మ సార్ధకం చేసుకొని ధన్యజీవి అయినాడని మద్దెల అభివర్ణించారు. అటువంటి గొప్ప మహానుభావులు స్వర్గీయ శివ శంకర్ మాస్టర్ తన అవసాన దశలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని బాధపడడం ఎంతో శోచనీయమనిమరి అంతటి గొప్ప కళాకారుల్ని మహానుభావుని ఆదుకోవడానికి సినీరంగం నుండి కేవలం మెగాస్టార్ చిరంజీవి హీరో ధనుష్ రియల్ హీరో సోనూసూద్ లాంటి ముగ్గురు మాత్రమేముందుకు రావడం ఎంతో దురదృష్టకరమని పిల్లికి బిచ్చం పెట్టకుండా సినీరంగంలో పెద్దలుగా చలామణి కావాలని పెత్తనం వెలగపెట్టాలని చూసే క్రమశిక్షణ అంటే తెలియని బూతుల రౌడీ క్రమశిక్షణ మోహన్ బాబు లాంటి వారికి మరియు నైతిక విలువలు తాకట్టుపెట్టి కుల మత ప్రాంతీయ తత్వం రెచ్చగొట్టి ధనబలంతో కుల బలం తో అక్రమ పద్ధతులలో 'మా' అసోసియేషన్కు అధ్యక్షుడిగా పెత్తనం వెలగబెడుతున్న ఫ్లాపుల హీరో మంచు విష్ణు కు ఇటువంటి వారి దుస్థితి కనబడడం లేదా వారు కళ్ళులేని కబోదులు లాగా ఉన్నారా అని మద్దెలఎద్దేవా చేశారు. దయచేసి సినీరంగంలోని 24 క్రాఫ్ట్ కు సంబంధించిన దయార్థ హృదయులు స్పందించి శివ శంకర్ మాస్టర్ కుటుంబాన్ని ఆదుకోవాలని మద్దెల విజ్ఞప్తి చేశారు. అంతేగాక తమిళనాడు తెలంగాణ ప్రభుత్వాలు మాస్టర్ కుటుంబానికి ఆర్థిక చేయూత అందించాలని భారత ప్రభుత్వం జాతీయ శివ శంకర్ మాస్టర్ కు పద్మశ్రీ అవార్డును అందజేయాలని మద్దెల ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. త్వరలో కొత్తగూడెంలో శివ శంకర్ మాస్టర్ అనురాగ స్మృతి లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం కాకుండా హైదరాబాద్ వెళ్లి మాస్టర్ కుటుంబ సభ్యులను దర్శించి తమ వంతు సహాయాన్ని కూడా అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో శివశంకర్ మాస్టర్ తో మద్దెల శివ కుమార్ కు కుమార్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి సింగర్ సింగరేణి అపర బాలు అల్లి శంకర్ గార్లకు ఎంతో అనుబంధం ఉన్నదని గొప్ప కళాకారుల్ని ఒక ఆత్మీయ అనురాగ అన్నయ్య ను కోల్పోయామని మద్దెల కన్నీటితో ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. శివ శంకర్ మాస్టర్ అకాల మృతికి సంతాపం తెలిపిన వారిలో మద్దెల బొమ్మ రెడ్డి అల్లి శంకర్ ల తో పాటు ప్రఖ్యాత సినీ సంగీత దర్శకులు శ్రీ ఘంటాడి కృష్ణ సినీ నిర్మాత దర్శకులు రైఫిల్ వెంకట్ రా మల్ల సినీ నటులు టి ధనరాజ్ గౌరవ సలహాదారులు సింగరేణి ఏరియా లైసన్ ఆఫీసర్ శ్రీ కలవర చంద్రశేఖర్ కళాకారులు కళా పోషకులు రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఏడీ ఈ శ్రీ కూరపాటి రామ సే శం రాజు కళాపోషకులు చిప్ప రాంప్రసాద్ కురిక్యాల సమ్మయ్య మూడు బాలు స్టీవెన్ ప్రముఖ సంగీత దర్శకులు మా రపాక కృష్ణస్వామి నటులు దర్శకులు లింగమూర్తి నటులు దర్శకులు సుభాకర్ సంగీత దర్శకులు విజయ్ తబలా డోలక్ బి క్కు లాల్ హైదరాబాదు నుండి ప్రత్యేకంగా శృతిలయ అకాడమీ గాన కోకిల శ్రీమతి ఆమని అక్క ఆదర్శ ఫౌండేషన్ అధినేత సేవా తత్పరులు శ్రీ కుసుమ భోగరాజు ప్రఖ్యాత గాయకుడు శుభాష్ ప్రముఖ యాంకర్ శ్రీ గాంధీ తదితరులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మమ్మల్ని సస్పెండ్ చేసినందుకు ఆనందంగా ఉంది: టీఎంసీ ఎంపీ

(మొదటి పేజీ తరువాయి)

ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు."చట్టాల రద్దుపై చర్చ చేయకుండా బిల్లుల ఆమోదం జరిగిపోయింది. అది వ్యతిరేకిస్తే సస్పెండ్ చేశారు. ప్రతిపక్షాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే జరిగిపోయింది. కానీ మేము మమతా బెనర్జీ, టీఎంసీ సైనికులం. ప్రజల కోసం పని చేస్తాము. ప్రజల కోసం చేస్తున్న పోరాటంలో మేము అరెస్ట్ అయ్యాం. అందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు నియంతృత్వం గురించి తెలుస్తోంది" అని టీఎంసీ ఎంపీ శాంతా ఛెత్రి అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలిరోజునే వివాదాస్పద సాగు చట్టాల ఉపసంహరణ బిల్లుపై ఎలాంటి చర్చ చేయకుండానే పార్లమెంట్ ఆమోదం పొందేలా చేసింది అధికార పార్టీ. అయితే చర్చ జరగకపోవడాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి. దీంతో 12 మంది ఎంపీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు రాజ్యసభ చైర్మెన్ వెంకయ్యనాయుడు తెలిపారు. 12 మంది సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

## విచక్షణా రహితంగా మందులు విక్రయిస్తున్న వారిపై పిడి యాక్ట్ పెట్టాలి

తెలంగాణ ఫార్మా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొలిపాక బాల్ రాజు



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :1948 లో వచ్చిన ఫార్మసీ యాక్ట్ ప్రకారం ఫార్మసీ విద్యార్హత గలవారినే ఫార్మసిస్టులుగా కొనసాగాలని,విచ్చలవిడిగా మందుల విక్రయాన్ని నియంత్రించాలని, వెంటనే డ్రగ్ ఇన్స్పెక్టర్, ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ అసోసియేషన్ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయట దేశాలలో ఫార్మసిస్ట్ లకు ఉన్న గుర్తింపు మన దేశంలో లేకపోవడం దయనీయం అన్నారు. ఆన్ లైన్ లో ఫార్మసీ విక్రయానికి పర్మిషన్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. విచక్షణా రహిత మందుల విక్రయం వలన చాలామంది వ్యాధిగ్రస్తులు అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు డాక్టర్ శివ కుమార్, ప్రభాకర్, కె.శ్రీనివాస్, ఎర్ర అశోక్,సి.సురేందర్, అహ్మద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఫోటోను కరెన్సీనోట్ల పై ముద్రించాలి: యస్ సి యస్ టి మేదావుల పోరామ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్

హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :భారతదేశా రాజ్యాంగ సృష్టి కర్త నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఫోటోను కరెన్సీనోట్ల పై ముద్రించాలని జాతీయ యస్ సి యస్ టి వేదావుల పోరామ్ అధ్యక్షులు డాక్టర్ ఆరేపల్లి రాజెందర్ కేంద్ర ప్రభుత్వం ను డిమాండు చేశారు. సోమవారం ఆయన ట్యాంకు బండ్ మీద ఉన్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ విగ్రహముకు పూల దండ వెసి జ్ఞాన యుద్ధ యాత్ర ను ప్రారంభించారు. తరువాత సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జేరిపోతుల పరుశురామ్ సి ఎ పి యస్ యస్ జాతీయ అద్యక్షులు ఏర్పాటు చేసిన జ్ఞాన యుద్ధ యాత్ర సమావేశంలో డాక్టర్ అరేపల్లి రాజెందర్ యస్ సి యస్ టి మేధావుల ఫోరమ్ జాతీయ అధ్యక్షులు మరియు మాస్టర్ కి టీవీ ఛానల్ డైరెక్టర్ కోఆర్డినేషన్ మాట్లాడుతూ కరెన్సీనోట్ల పై డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పోటోను ముద్రించాలని అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి చిత్ర పటాన్ని పెట్టాలని జేరిపోతుల పరుశురామ్ పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షులు చేస్తున్న జ్ఞాన యుద్ధ యాత్ర భారతదేశానికి ఆదర్శం అన్నారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ తన కుటుంబం పోగొట్టుకున్నా, దేశం కోసం రాజ్యాంగం రాసారని, అందరికీ అన్ని వేళలా అందుబాటులో ఉండాలని కొరుకున్న మేధావి అమేరికా దేశం సైతం డాలర్ పై అంబేద్కర్ ముద్ర వేసింది ఎందుకో మన దేశంలో అంబేద్కర్ గారి పోటో వెయ్యక పోవడం అన్యాయం అని అన్నారు. వెంటనే పార్లమెంటు సభ్యులు దేశ ప్రదాన మంత్రి రాష్ట్రపతి ఉప రాష్ట్రపతి వెంటనే కరెన్సీనోట్ల పై డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పోటోను ముద్రించేలా చెయ్యాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు గొల్లే పల్లి దయానందు, టి యు నాయకులు స్కైలాబ్ బాబు,కె వి పి యస్ జనరల్ సెక్రెటరీ సురేష్ తెలంగాణ గాయకులు , వి. యల్. పౌండెషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వి ల్లో డి . లక్ష్మయ్య కార్యక్రమంలో స్వామి ,బ్లెసి అంబేద్కర్, రాంచందర్ ,పరుశరాములు, రవి వేణు తదితరులు పాల్గొన్నారు.







# అత్తాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేయండి

### రాష్ట్ర విద్యా మౌలిక వసతుల కల్పన సంస్థ అధ్యక్షుడు జి.నాగేందర్ గౌడ్



వికారాబాద్ బ్యూరో 29 నవంబర్ ప్రజా పాలన : వికారాబాద్ జిల్లా పరిధిలో గల నవాబ్ పేట్ మండలానికి చెందిన అత్తాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర విద్యా మౌలిక వసతుల కల్పన సంస్థ అధ్యక్షులు జి నాగేంద్ర గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం లో నవాబ్ పేట్ మండల పరిధిలోని అత్తాపూర్ గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ కావలి స్వరూప భీమయ్య, గ్రామస్థులతో కలిసి రాష్ట్ర విద్యా మౌలిక వసతుల కల్పనల సంస్థ అధ్యక్షుడు నాగేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ధరణి పోర్టల్ లో తప్పుగా నమోదైన సర్వే నంబర్లను మార్పు చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని నవపేట్ మండలం అత్తాపూర్ గ్రామానికి బదులుగా రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ లో పొరపాటున రైతుల యొక్క సర్వే నంబర్లు ధరణి పోస్టర్ లో తప్పుగా రిజిస్టర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అత్తాపూర్ గ్రామానికి వచ్చి తగు విచారణ జరిపి తప్పుగా నమోదైన సర్వే నంబర్లను సరి చేయాలని కోరారు.లి శివ సాగర్ నీటి కాలుష్యాన్ని నివారించండి : వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి నుండి ప్రవహించే మూసీ నదిలో వికారాబాద్ మున్సిపాలిటీ డ్రైనేజీ నీరు వదలడం వలన మీరు అపరిశుభ్రంగా మారుతుందని రాష్ట్ర విద్యా మౌలిక వసతుల కల్పన సంస్థ అధ్యక్షుడు నాగేందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతగిరి నుండి ప్రవహించే మూసీ నది నీరు శివారెడ్డి పేట నుండి వచ్చే కలుషిత నీటిని శుద్ధి చేయకుండా వాడడం వలన మూసీ నది అపరిశుభ్రంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు హైదరాబాదులోని గండిపేటలో మూసీ నది నీరు మురికి నీరు గా మారుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు అనంతగిరిపల్లి లోని నీరు నవపేట్ మండలం శంకర్పల్లి మండలం గండిపేట లోని కొన్ని మూగజీవులు పశువులు మేకలు కలుషిత నీరు తాగి మరణించాయని పేర్కొన్నారు. కలుషిత నీటిని శుద్ధి చేయకపోవడంతో హైదరాబాదులో నివసిస్తున్న ప్రజలు గండిపేట చెరువు లోని నీటిని తాగి అనేక వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే శివా రెడ్డి పేట చెరువు పారిశుద్ధ్య రహిత తీర్చిదిద్దాలని కోరారు

### ముష్టికుంట్ల గ్రామంలో అయ్యప్ప స్వాముల వన సమారాధన



బోనకల్, నవంబర్ 29 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలో ముష్టికుంట్ల గ్రామంలో మల్లెల వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష స్వాములు సోమవారం నాడు కార్తీక మాసం చివరి సోమవారం వన సమారాధన జరిగింది. వనములో స్వాములు భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి, కుమారస్వామి, లక్ష్మీదేవి, శ్రీమన్నారాయణ అయ్యప్ప స్వామి,అష్టోత్తర శతనామ పూజ నిర్వహించారు. అదేవిధంగా వన దేవత అమ్మవారు ఉసిరి చెట్టు కి పూజ చేసి, గోమాత పూజ కార్యక్రమం, గో ప్రదర్శన చేసుకొని ముష్టికుంట్ల, పక్కన గ్రామాల అయ్యప్పదీక్ష స్వాములు అందరూ కూడా అన్నదానం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్, గోవా క్యాంపుకు తరలింపు



వైరా, నవంబరు 29 ప్రజాపాలన ప్రతినిధి:ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయం నందు నియోజకవర్గంలోని ఐదు మండలాల స్థానిక ప్రజాప్రతినిధులు తో సమీక్ష నిర్వహించి ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ప్రజాప్రతినిధులను రెండు బస్సుల్లో హైదరాబాద్ గోవా క్యాంపుకు తరలించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు స్థానిక సంస్థల అభ్యర్థి ఎమ్మెల్సీ అభ్యర్థి తాత మధును గెలిపించడమే ధ్యేయంగా పనిచేయాలని స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పార్టీ సూచనను శిరసా వహించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు ఎంపీటీసీలు వార్డు కౌన్సిలర్లు స్థానిక టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి లో ఎమ్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో కొండయ్య అబ్దుల్ కలాం ఇన్ స్పైర్ పురస్కారం



మధిర నవంబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి : సత్తుపల్లిలో ఎమ్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హల్ అబ్దుల్ ఖాలం ఇన్స్టిట్యూట్ అఫ్ యూత్ ఎక్సలెన్స్ మరియు డిస్ట్రిక్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూత్ ఎంపవర్ మెంట్ ప్రోగ్రామ్ నందు గత 25 సంవత్సరాలనుండి హెచ్ఐవి ఎయిడ్స్ పై సామజిక సంపూర్ణ అవగాహన తో వివిధ సామాజిక రుగ్మా తలు పై యూత్ స్టూడెంట్స్ కు అవగహన పరుస్తూదుకుఅబ్దుల్ ఖాలం ఇన్సపైర్ పుర్స్కా రం డిఫెన్స్ రేచర్చ్ డోవలప్ మెంట్ ఆతర్టీ చైర్మన్ గా సతీష్ రెడ్డి మరియు అమెరికన్ కంపెనీ సీఈఓ %చీ=×% ఫౌండేషన్ జోతి రెడ్డి పారిశ్రామిక వేత్త హరినాథరావు ఖాలం % యూత్ ఎక్సలెన్సీ నిర్వహుకులు నరేష్ ఇండియన్ సంద్ర వెంకట వీరయ్య షేర్ %అస్త్రశీ% డైరెక్టర్ జీగోపాల్ రెడ్డి ట్రూత్ ఫర్ గొస్పెల్ మినిస్ట్రీష్ డైరెక్టర్ రెవరెండ్ ఎనోష్ చేతులు మీద గా అందుకు న్నారు అవార్డు రావటం పట్ల మధిర ప్రముఖులు కొండయ్య కు అభినందనలు తెలియజేసినారు. కొండయ్య కు అవార్డు రావటం మధిర రాజకీయ ప్రముఖులు అభినందిస్తూ ముందు ముందు ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎర్రుపాలెం మండలం లోని ప్రజలకు పోలీసు వారు చేయు విజ్ఞప్తి



ఎర్రుపాలెం నవంబర్ 28 ప్రజా పాలన ప్రతినిధి: గొడవలు వద్దు-రాజీలు ముద్దు వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవిత కాలం కొనసాగుతాయి. ఒక వేల ఇంతటితో కలిసుంటాము అని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే సమసిపోతాయి. మీరే తేల్చు కో%శీ%డి వివాదాలు కావాలా...? రాజీలు కావాలా...? మీ ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ తేదీ. 11-12-2021 వ తారీఖున మధిర కోర్టులో "మెగా లోక్ అదాలత్" ఉంది కాబట్టి ... మీ పై కానీ, మీకు తెలిసిన వాళ్ల పై గాని ఏమైనా కేసులు ఉంటే వాటిని కాంప్రమైజ్ చేసుకొని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసును పూర్తిగా కొట్టివేయబడును. రాజీ మార్గమే రాజ మార్గము దయచేసి ఆలోచించండి నిర్ణయం తీసుకోండి.

### సిపిఎం జిల్లా మహాసభలో బోనకల్ మండల నివేదికను ప్రవేశపెడుతున్న మండల కమిటీ సభ్యురాలు గుగులోతుశారద





బోనకల్, నవంబర్ 29 ప్రజా పాలన ప్రతినిధి:సిపిఎం ఖమ్మం జిల్లా 21 వ మహాసభలు నవంబర్ 29 30 తేదీలలో ఖమ్మం పట్టణంలోని యంబి గార్డెన్ లో ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా పార్టీ కార్యదర్శి ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికలపై బోనకల్ మండల కమిటీ సభ్యుల అభిప్రాయాలను మండలం లో పార్టీ తరపున నిర్వహించిన రైతాంగ పోరాటాలు ,కార్మిక వర్గ పోరాటాలు, సామాజిక పోరాటాలను,భవిష్యత్ లో పార్టీ ఎదుగుదలకు నిర్వహించనున్న పోరాటాలకు సంబంధించిన కార్యాచరణను, జిల్లా పార్టీ ఇచ్చిన వివిధ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేసిన పలు కార్యక్రమాలకు సంబంధించి మండల కమిటీ తరపున సిపిఎం మండల కమిటీ సభ్యురాలు గుగులోతు శారద నివేదికను ప్రవేశ పెట్టడం జరిగింది. . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి పార్లమెంటులో చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ను అదుపులోకి తేవాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతిని కల్పించాలని,మహిళల రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దొండపాటినాగేశ్వరరావు, మండల మాజీ ఎంపీపీ, జడ్పిటిసి కొమ్ము శ్రీనివాసరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, కిలారు తిరపయ్య, తెల్లాకుల శ్రీనివాసరావు, పివి అప్పారావు, బంధం శ్రీను, తుళ్ళూరి రమేష్ ,దొప్ప కురివి,ఏడునూతల లక్ష్మణ్ రావు, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, జొన్నలగడ్డ సునీత, నల్లమోతు వాణి , గుడ్డూరి ఉమ,గండు సైదులు, గుగులోతు పంతులు, నరేష్, మాజీ ఎంపీపీ చిట్టిమోధు నాగేశ్వరావు, మురళి, కోట కాటయ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ రైతులకు న్యాయం చేయండి: సిపిఎం జిల్లా నాయకులు ఆర్.మహిపాల్





వికారాబాద్ బ్యూరో 29 నవంబర్ ప్రజా పాలన : ధారూర్ మండలం కొండాపూర్ కుర్దు గ్రామంలోని సర్వే నెంబర్ 39 లో గల ఐదుగురు దళితులకు, 4 గురు బీసీలకు, ఓసీలకు ప్రభుత్వము పట్టాలు ఇచ్చిందని సిపిఎం జిల్లా నాయకులు ఆర్ మహిపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తంం చేశారు. భూములు గుంజుకునే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు అధికారుల దౌర్జన్యం ఖండిస్తూ ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఆర్ మహిపాల్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు లాలయ్యా, సీపీఎం మండల కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 39 లో ఐదు మంది దళిత కుటుంబాలకు 6 ఎకరాల భూమి పట్టా సర్టిఫికేట్ ఇచ్చారు. బిసి కుటుంబాలు ముగ్గురు కబ్జాలో ఉన్నారు. ఫారెస్ట్ అధికారులు వచ్చి సర్వే చేసి తీసుకుంటామని అన్నారు. ఎవరు సాగులో ఉండరాదు మా భూములు మాకు ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తున్నారని ఎఫ్ ఆర్ ఓ బీట్ ఆఫీసర్ మధుకర్ రెడ్డి సి అరుణ చెన్నయ్య ల పై చర్య తీసుకొని రైతుల భూములు రైతులకు సాగు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెడ్డిలు కబ్జాలో ఉండి పంటలు పండించుకుంటున్నారు. వాళ్లు పోయేందుకు దారి లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై చర్య తీసుకుని రైతులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు రైతులు ఆందోళన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాలకొండయ్య మల్లయ్య పెంటయ్య నరసింహులు మల్లయ్య సత్తయ్య పెద్ద కొండ నర్సింలు రాములు అంజయ్య అంజమ్మ మాల లక్ష్మయ్య బాలకిష్టయ్య బలరాములు దాసరి వెంకటయ్య రెడ్డి బాల్ రెడ్డి వెంకట్ రెడ్డి దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెంగిచెర్లలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



మేడిపల్లి, నవంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల 3వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్ తో కలిసి మేయర్ సామల బుచ్చిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐ అంజి రెడ్డి, ఎస్ఐ రఘురాం, కార్పొరేటర్లు సుమన్ నాయక్, కిరణ్ కుమార్,కొత్త దుర్గమ్మ మరియు కో అప్షన్ సభ్యులు రంగ బ్రమ్మన్న గౌడ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవిగౌడ్, కొత్త విక్రమ్ గౌడ్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు మహాసభలకు ముస్తాబవుతున్న బోనకల్



బోనకల్, నవంబర్ 29 ప్రజా పాలన ప్రతినిధి: ఈ నెల 30వ తేదీన జరిగే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏ ఐ కె ఎస్ 20వ జిల్లా మహాసభలకు బోనకల్ మండల కేంద్రం ముస్తాబయింది .దాదాపు అరవై నాలుగు సంవత్సరాల తర్వాత ఈ ప్రాంతంలో రైతు మహాసభలు జరుగుతుండటంతో మండలంలోని రైతు నాయకులు ఈ మహాసభల ఏర్పాట్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏ ఐ కె ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ తో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాదులు మహాసభలకు రానున్నట్లు తెలుస్తోంది. దాదాపు 250 నుండి 300 మధ్య రైతు ప్రతినిధులు ఈ మహాసభలో హాజరై నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటారని సమాచారం, కావున మండలంలోని గ్రామాల్లో ఉన్న రైతులు ఈ రైతు సంఘం మహాసభను విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాము.

## పొరపాట్లకు ఆస్కారం లేని ఓటరు జాబితా తయారు చేయాలి

### జిల్లా కలెక్టర్ భారతి హెూళీ కేరి



మంచిర్యాల బ్యూరో, నవంబర్ 29, ప్రజాపాలన: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం-2022 లో భాగంగా ఈ నెల 1 నుండి 30వ తేది వరకు నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులతో పొరపాట్లకు ఆస్కారం లేకుండా తుది జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ భారతి హెూళీకేరి అన్నారు. సోమవారం మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల పరిధిలో పలు ప్రాంతాలలో పర్యటించి నూతనంగా ఓటు హక్కు నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం చేసుకున్న దరఖాస్తులు, నూతన ఓటరు జాబితాలో చేపట్టిన సవరణలు పరిశీలించిన అనంతరం క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేశారు. నూతనంగా చేర్చబడిన వారి ఇంటి వద్దకు స్వయంగా వెళ్లి స్టడి, బర్త్, ఇతర ధృవీకరణలను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారుల ద్వారా నూతనంగా ఓటరు జాబితాలో చేర్చబడిన, చనిపోయిన, చిరునామా, ఇతర సవరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా రూపొందించడంలో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషించాలని, జాబితా తయారు లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అర్హత గల వారి పూర్తిస్థాయి వివరాలతో జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ ఉప తహసిల్దార్ సంతోష్, మంచిర్యాల తహసిల్దార్ రాజేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన
సంపాదకీయం
మంగళవారం 30, నవంబరు 2021

# జనాభా వృద్ధికి జాగ్రత్తగా పగ్గం

దేశంలో జనాభా విస్ఫోటన భయం కొంత తగ్గినట్టే! జనాభా వృద్ధి నియంత్రణ చర్యలు ఫలితా లిస్తున్నాయి. దాదాపు దేశమంతటా ఆశించిన స్థాయిలోనే జనాభా వృద్ధిని కట్టడి చేయగలిగినట్టు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్హెచ్ఎస్5) తేల్చింది. మరో ఆరోగ్యకరమైన సంకేతం... దేశంలో మహిళా జనాభా పురుష జనాభాను దాటడం. ప్రతి వెయ్యి మంది పురుషులకు దేశంలో 1020 మంది మహిళలున్నట్టు తాజా సర్వే తెలిపింది. ఇలా మహిళల జనాభా పెరగడం, దాదాపు మూడు దశాబ్దాల ఈ సర్వే పర్వంలో తొలి నమోదు! అయితే ఈ లింగ నిష్పత్తి జననాల స్థాయిలో (ఎస్సార్బీ) ఇలా లేదు! అక్కడ పరిస్థితి భిన్నంగానే ఉంది. ప్రతి వెయ్యిమంది పురుషులకు 929 మంది మహిళలే ఉంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్వో) సహజమని చెప్పే స్త్రీపురుష నిష్పత్తి 9501000తో పోలిస్తే ఇది తక్కువే! కానీ, అయిదేళ్ల కిందటి 201516 సర్వే (ఎన్ఎఫ్హెచ్ఎస్4) చెప్పిన నిష్పత్తి (9191000) కన్నా ప్రస్తుత పరిస్థితి మెరుగే! పరిమిత నమూనాలతో జరిపే ఈ సర్వే ఫలితాలను ప్రామాణికంగా భావించరు. పదేళ్లకోసారి వచ్చే సాధా రణ జనాభా లెక్కలే ప్రామాణికం. 2001, 2011 జనాభా లెక్కల్లో స్త్రీపురుష నిష్పత్తి సరళి కూడా ఇట్లాగే ఉంది. సాపేక్షంగా ఈ సర్వే నివేదికలూ వాస్తవికతకు దగ్గరగా ఉన్నట్టే! ఒకటి మాత్రం నిజం. వివిధ సమాజాల్లో ఈ లింగవివక్ష, కాన్పుకు ముందే లింగ నిర్ధారణ దురదృష్టకరం, నేరం! ఆడ పిల్లలను అంతమొందించే భ్రూణహత్యలు జరుగుతూనే ఉన్నాయి. వెయ్యిమంది పురుషులకు హిమాచల్‌ప్రదేశ్(875), తమిళనాడు(878), హరియాణా(893), ఒడిశా(894) లాగే తెలంగాణ (894)లోనూ మహిళల సంఖ్య తక్కువగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్‌లో కొంత మెరుగ్గా (934) ఉంది. కేరళలో అయిదేళ్ల కింద 1047గా ఉన్న మహిళల సంఖ్య తాజాగా 951కి పడిపోయింది. ఢిల్లీలో 812 నుంచి ఏకంగా 923కి పెరిగింది! ఒట్టి జననాల్లో కాకుండా మొత్తం జనాభాలో మహి ళల నిష్పత్తి పురుషుల కన్నా ప్రస్తుతం పెరగడానికి పలు కారణాలుంటాయి. మరణాల రేటులో వ్యత్యాసం, మహిళల్లో ఆయుఃకాలం పెరగటం వంటివీ ఈ అంశాన్ని ప్రభావితం చేస్తాయి. కుటుంబ ఆరోగ్య సర్వేలో కొన్ని మంచి ఫలితాలు కనిపిస్తే, మరికొన్ని విషయాల్లో ఆందోళనకర సంకేతాలు వెలువడటాన్ని పాలకులు గుర్తించాలి. పిల్లలు, మహిళల్లో పౌష్టికాహార లోపం, ఇనుము కొరవడి రక్తహీనత (అనీమియా) ప్రబలడాన్ని తీవ్రంగా పరిగణించి, నివారణ చర్యల్ని ముమ్మరం చేయాలి. పిల్లల్లో రక్తహీనత కేసులు గత సర్వే కాలంలో 58.6 శాతం ఉంటే, ఇప్పుడది 67 శాతానికి పెరిగింది. గర్భిణీల్లో 50.4 శాతం నుంచి 52.2 శాతానికి, 1549 మధ్య వయస్కులైన మహిళల్లో 53 నుంచి 57 శాతానికి పెరిగింది. అదే వయసు పురుషుల్లో 22.7 నుంచి 25 శాతానికి పెరగటం సమస్య తీవ్రతకు నిదర్శనం. 'అనీమియా రహిత భారత్' నినాదంతో, 2022 నాటికి కేసుల్ని తగ్గిం చాలని కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేస్తున్నా ఆశించిన ప్రగతి లేదని సర్వే తేల్చింది. పళ్లు, కూరగాయలు సరిగా తినకపోవడం, ఇతరత్రా పౌష్టికాహార లోపాలతోనే రక్తహీనత పెరిగి సమస్య జటిలమౌతోంది. కరోనా కాలంలో ఆదాయాలు రమారమి పడిపోయి, నిత్యావసరాల ధరలు పెరగ టం కూడా ఈ సమస్యను తీవ్రతరం చేసింది. రోజువారీ భోజనంలో, తమ ఆర్థిక స్థాయిలోనూ సమ కూర్చుకోగలిగిన నిర్దిష్ట ఆహార పదార్థాలపైన జనాలకి స్పష్టమైన అవగాహన ముఖ్యం. జాతీయ పౌష్టికాహార సంస్థ ప్రచారం కల్పిస్తున్నప్పటికీ, సరిపోవడం లేదు. ప్రజలింకా చైతన్యం కావాలి. దేశవ్యాప్తంగా మొత్తం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను గ్రూపులు చేసి రెండు విడతల్లో నిర్వహించిన ఈ సర్వే ఏపీ, తెలంగాణల్లో తొలివిడతలోనే జరిగింది. వైద్యారోగ్యపరంగా కొన్ని మంచి సంకేతాలీ రాష్ట్రాల్లో వెలువడ్డాయి. పౌరులకు ఆరోగ్య భీమా వర్తింపజేయడంలో దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు అగ్రభాగాన ఉన్నాయి. ఏపీలో పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చించి 'నాడు నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వాసుపత్రుల రూపురేఖల్ని మారుస్తున్న చర్య సత్ఫలితాలిస్తోంది. ఆస్పత్రుల్లో కాన్పులు పెరిగాయి. కాన్పువేళ, తదనంతరం మాతాశిశు మరణాలు తగ్గాయి. కొన్ని విషయాల్లో దేశవ్యాప్తంగానూ ఆశావహ సంకేతాలున్నాయి. దేశంలో నాల్గింట మూడొంతుల మంది మహిళలు బ్యాంకుల్లో అకౌంట్లు తెరిచారు. స్త్రీపురుషుల్లోనూ ఇంటర్నెట్ వాడకం బాగా పెరిగింది. గృహ హింస, అదీ జీవిత భాగస్వామి నుంచి తగ్గినట్టు నమోదైంది. కుటుంబ నియంత్రణ పట్ల అవ గాహన పెరగటమే కాక సురక్షిత పద్ధతులు వారికి తెలిసి వచ్చాయి. జననాల రేటు తగ్గించడంలో ఇదెంతో ఉపయోగపడ్డట్టు గణాంకాలున్నాయి. జనాభా వృద్ధి కట్టడిలో చాలా రాష్ట్రాలు గణనీయ ఫలితాలే సాధిస్తున్నాయి. మొత్తం సంతానోత్పత్తి రేటు(టీఎఫ్ఆర్)ను 2.1 కన్నా తక్కువకి నియం త్రిస్తే జననమరణాల ప్రక్రియ కొనసాగుతూనే, ఇప్పుడున్న జనసంఖ్య స్థిరపడుతుందనేది ఓ లెక్క! బిహార్, మేఘాలయ, మణిపూర్, జార?ండ్, ఉత్తరప్రదేశ్ తప్ప దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలూ టీఎఫ్ఆర్‌ని 2 కన్నా కిందే నిలిపేయడం మంచి పరిణామం. అయినా, 204050 సంవత్సరాల మధ్య భారత్ అత్యధిక (160 నుంచి 180 కోట్ల మందితో) జనాభా దేశంగా ఆవిర్భవించనుంది. 2031 నాటికే చైనాను అధిగమిస్తామని మరో అధ్యయనం! 2022కే అధిగమి స్తామన్న ఐక్యరాజ్యసమితి (యూఎన్) అంచనాను తప్పించామంటే, జన విస్ఫోటన తేదీని మనం ముందుకు, మరింత ముందుకు జరుపుతున్నట్టే లెక్క! ఇది ఆశావహ సంకేతం!!

# విమర్శ గొంతు నొక్కుతారా?

వీర్ దాస్.. ఓ ప్రముఖ స్టాండప్ కమెడియన్. ఇటీవల అమెరికా లోని వాషింగ్టన్ డీసీ లో కెనడీ సెంటర్లో నిర్వహించిన ప్రదర్శనలో 'టూ ఇండియాస్' పేరుతో ఆయన చదివిన ఓ ఆంగ్ల పద్యం వివాదాస్పదమైంది. 'ఐ కమ్ ఫ్రమ్ టూ ఇండియాస్' అంటూ సాగిన ఆ పద్యాన్ని కొందరు తీవ్రంగా విమర్శిస్తుండగా.. మరి కొందరి నుంచి ఆయనకు మద్దతు లభిస్తోంది. 'నేను భారత్ నుంచి వచ్చాను. అక్కడ గాలి నాణ్యత సూచి 9000 ఉంటుంది. కానీ మేం ఇంటి డాబాపైనే పడుకుంటాం. నక్షత్రాలను చూస్తాం'.. 'నేను శాఖాహారిగా ఉండటం గర్వంగా భావించే భారత్ నుంచి వచ్చాను. కానీ కూరగాయలు పండించే రైతుల మీద నుంచే విచక్షణా రహితంగా వాహనాలు నడుపుతుంటాం'.. అంటూ సాగింది వీర్ దాస్ పద్యం. అయితే ఒక సందర్భంలో 'భారత్‌లో మహిళలను పగలు పూజిస్తారు. రాత్రివేళల్లో వారిపై సామూహిక అత్యాచారాలు చేస్తారు'.. అంటూ పేర్కొన్నారు. అయితే భారతదేశం లోని సమస్యలను చర్చించడంపై పెద్దగా వ్యతిరేకత లేకపోయినా.. అమెరికా వెళ్లి అక్కడ మాట్లాడడం ఏంటంటూ చాలా మంది విమర్శించారు. విమర్శించే వారితోపాటు సమర్థించే వారి సంఖ్య కూడా తక్కువేమీ లేదు. తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో వీర్ దాస్ కూడా స్పందించారు. 'ఇది రెండు వేర్వేరు భారత దేశాల గురించిన ఒక వ్యంగ్య నాటిక' అని చెప్పుకొచ్చారు. 'ప్రతీ దేశానికి మంచి చెడులు, చీకటి, వెలుగు ఉంటాయి. ఇదేం రహస్యం కాదు. నాటిక వల్ల మనమంతా ప్రేమించే, గర్వించే, విశ్వసించే భారతదేశానికి అమెరికా వేదికపై భారీ చప్పట్లు లభించాయి. దయచేసి ఎడిట్ చేసిన కాపీలను చూసి మోసపోకండి' అంటూ వీర్ దాస్ చెప్పుకొచ్చారు. దాదాపు ఏడు నిమిషాల పాటు సాగిన వీర్ దాస్ పద్యం కేవలం చేదు నిజాలను మాత్రమే బహిర్గతపర్చలేదు. నేడు దేశం



ఎదుర్కొంటున్న సమస్యలపై మాత్రమే చర్చించలేదు. భారతదేశం రెండు కోణాలను ఈ పద్యం ఆవిష్కరించింది. భారతదేశం యొక్క గొప్పతనాన్ని, మహోన్నతమైన సంస్కృతిని, స్ఫూర్తిదాయకమైన తత్వాన్ని ప్రపంచం ముందుకు తీసుకువచ్చింది. వీర్ దాస్ టూ ఇండియాస్‌లో తాను గర్వించదగిన భారతదేశం గురించి కూడా మాట్లాడారు. అయితే కొన్ని మీడియా సంస్థలు ఆయన పద్యం వీడియో క్లిప్పులను కట్ చేసి చూపిస్తుండడంతోనే సమస్యంతా వచ్చి పడింది.

## సమస్యలపై మాట్లాడితే నష్టమా..?

సమస్యలను కప్పిపుచ్చి ఉంచడం అంటే దేశానికే నష్టం చేకూర్చడమే. అంతేకాకుండా దేశ సమస్యలను దేశం లోపలే చర్చించాలనుకోవడం ఒక మానసిక రుగ్మతగా చెప్పవచ్చు. విదేశీ వేదికలు, డాక్యుమెంటరీల ద్వారా అమెరికాకు చెందిన నిఘా సంస్థలను, ఆ దేశ యుద్ధ తంత్రాలను ఎడ్వర్ట్ స్నోడెన్ విమర్శించడం, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఒక వ్యక్తి అమెరికా లేదా బ్రిటన్‌లో తాలిబాన్ల పాలనను, అక్కడి పరిస్థితులను విమర్శించడం తప్పు పట్టలేం కదా. అక్కడి వ్యక్తులు ఇది తమ దేశాలనూ అవమానించడమే అంటే హాస్యాస్పదంగా కనిపిస్తుంది. అంతేకాకుండా అక్కడి ప్రజలు కూడా దేశ సమస్యలను దేశం లోపలే చర్చించుకోవాలని చెప్తే సమర్థిస్తారా..! ప్రపంచ దేశాలు ఏమనుకుంటాయేమోననే భావనతో సమస్యలపై గళమెత్తడం మానేయాల్సిందేనా..! భారత్‌లో నెలకొన్న సమస్యలు అమెరికాకు తెలియవా? గ్లోబలైజేషన్ ప్రపంచంలో భారత్ ఒక భాగం. ప్రపంచ దేశాలతో వాణిజ్యం చేస్తున్నాం. కొన్ని వస్తువులను ఎగుమతి చేస్తుండగా, మరి కొన్నింటిని దిగుమతి చేసుకుంటున్నాం. 2019 డేటా ప్రకారం 27 లక్షలకు పైగా భారతీయులు అమెరికాలో నివసిస్తున్నారు. అదే సందర్భంలో ఏడు లక్షలకు పైగా అమెరికన్లు ఇండియాలో నివాసముంటున్నారు. అంతేకాకుండా పర్యాటకంగా చాలా మంది వస్తూ, వెళ్తూ ఉంటారు. అమెరికాలో 'బ్లాక్ లైవ్స్ మ్యాటర్' ఉద్యమం జరిగినా, అక్కడి రాజధానిలో అల్లర్లు జరిగినా ఇండియా లోని ప్రతి ఒక్కరికి ఆ సమాచారం అందుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికి తీసేందుకు, రాజకీయ నాయకుల బాగోతాలను, కొన్ని దేశాల కుట్రలను బయట పెట్టేందుకు అంతర్జాతీయంగా జర్నలిస్టులందరూ కలిసి ఒక కన్సార్టియంగా ఏర్పడుతున్న కాలమిది. ప్యారడైజ్ పేపర్స్, పనామా పేపర్స్, ఫేస్ బుక్ పేపర్స్ అంటూ దేశాలనే కదిలించేసే, కుట్రలను బహిర్గతం చేసే కథనాలను వివిధ దేశాలకు చెందిన జర్నలిస్టులందరూ కలిసి బయటపెట్టారు. ఇలాంటి కాలంలో అమెరికా వేదికపై భారతదేశ సమస్యలను లేవనెత్తారని వీర్ దాస్ ను విమర్శించడం సరికాదు. భారతదేశ చేదు నిజాలను ప్రపంచం ముందు బహిర్గతపరిచింది వీర్ దాస్ ఒక్కరే కాదు. వీర్ దాస్ లేవనెత్తిన అంశాలను టైమ్ మ్యాగజైన్ ఎప్పుడో ప్రచురించింది. న్యూ యార్క్ టైమ్స్ లో సైతం ఇలాంటి కథనాలను రాశారు. గార్డియన్, వాల్ స్ట్రీట్ జర్నల్, లాస్ ఏంజెల్స్ టైమ్స్ లాంటి ఎన్నో పత్రికలు భారతదేశంలో జరుగుతున్న ఘటనలను రిపోర్ట్ చేశాయి. యునైటెడ్ నేషన్స్, యూఎన్ డీపీ, ప్రపంచ బ్యాంకు, ప్యూ రీసెర్చ్ సెంటర్, ఎకనామిస్ట్ గ్రూప్ లాంటి సంస్థలు భారతదేశానికి సంబంధించిన అంశాలను పరిశోధించి, వాటిపై నివేదికలు రూపొందించి ప్రపంచదేశాల ముందుంచాయి. అంతేకాకుండా యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్ బుక్ లాంటి సోషల్ మీడియా సాధనాల ద్వారా ప్రతి చిన్న విషయం ప్రపంచానికి నిమిషాల్లోనే తెలిసిపోతున్న కాలమిది. వీర్ దాస్ ప్రదర్శనకు వచ్చిన అత్యధిక మంది ప్రేక్షకులు అమెరికన్లు కారు.. వారు వివిధ దేశాలకు చెందిన ఎన్ఆర్ఐలు. కాబట్టి వీర్ దాసే మొట్టమొదటిసారిగా యూఎస్‌లో భారతదేశ అంశాలను లేవనెత్తారని చెప్పడం మూర?త్వమే అవుతుంది. సమస్యలు అన్ని దేశాల్లోనూ ఉంటాయి. ప్రపంచంలో ఏ చోట అన్యాయం జరిగినా దానిని ఎక్కడైనా లేవనెత్తే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుంది. మీరు భారతదేశ ప్రతిష్టను ప్రపంచ దేశాల ముందు మెరుగు పర్చాలనుకుంటే ముందుగా దేశంలో ఉన్న సమస్యలను గుర్తించి, అంగీకరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత వాటి గురించి మాట్లాడాల్సి ఉంటుంది. అనంతరం వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించాల్సి ఉంటుంది. బేధాలు లేకుండా సత్వర న్యాయాన్ని అందించే, సమస్యలు లేని భారతాన్ని సృష్టించడమే అసలైన దేశభక్తి.

# మందులోడా... ఓరి మాయలోడా!

మనుషుల అవసరాలే వ్యాపారులకు లాభాలు తెచ్చే గనులు. మనుషులకు ఏం కావాలో ఓ కంట కనిపెట్టి వ్యాపారులు వాటిని తయారు చేసే పనిలో పడతారు. యుగాల తరబడి జరుగుతున్నది ఇదే. అసలైన వ్యాపారి ఎడారిలో ఇసుకను ఒంటెలకు అమ్మి బతికేయగలడు. తన దగ్గర ఉన్నదాన్నే ప్రజలకు అవసరం అయ్యేలా చేసే వ్యాపారులు మాయలోళ్లే! డబ్బు అవసరం ఉన్నవారికి వడ్డీకి అప్పులు ఇవ్వడం కొందరి వ్యాపారం. డబ్బుకు ఎంతగా కటకటలాడుతున్నారో తెలుసుకొని, దానికి అనుగుణంగా వడ్డీ రేటు పెంచేస్తూ ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా పెద్దపెద్ద దేశాలు కూడా అదే చేస్తాయి. చిన్న దేశాల అవసరాలను ఆసరా చేసుకొని, ఆ దేశాలను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి వాటికి ఆర్థిక సాయం ముసుగులో అప్పుల ఊబిలోకి దింపేస్తాయి. ఒకప్పటి పెద్దన్న అమెరికాను కూడా భయపెడుతున్న చైనావాడు చేస్తున్నది అదే! ఎవరికన్నా ఏ రోగమో వస్తే దాన్ని నయం చేసే మందు తయారు చేయడం లాభసాటి వ్యాపారం. మరి మనుషులకు రోగాలే రాకపోతే ఆ వ్యాపారుల పరిస్థితి ఏంటి? అందుకోసం ఆ వ్యాపారులు ఏం చేస్తారు? అందరికీ తరచుగా రోగాలు వస్తూ ఉండాలని దేవుణ్ణి కోరుకుంటారు. ప్రపంచాన్ని శాసిస్తున్నది ఔషధ వ్యాపారమే! ఫార్మా కంపెనీలు మూడు మాత్రలు... ఆరు గోలీలన్నట్లు దూసుకుపోతున్నాయి. కొన్ని దశాబ్దాల క్రితం వర్షాకాలం ఆరంభంలో జ్వరం రావడమే పెద్ద రోగం. దానికి మిరియాల కషాయంతోనో, శొంఠి కషాయంతోనో వంటింటి వైద్యం చేసేసుకునేవారు. రెండేళ్ళుగా మొత్తం ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది కరోనా. ఈ రెండేళ్లలో లక్షల కోట్ల రూపాయల మేరకు ఔషధ వ్యాపారం, ఆసుపత్రుల వ్యాపారం జరిగాయి. ఎప్పుడూ వినని, ఎన్నడూ కనని కరోనా రోగం ఓ వైరస్ వల్ల వ్యాప్తి చెందుతోంది. అయితే ఈ వైరస్ దానంతట



అదిగా పుట్టిందా, లేక మనుషులే తయారు చేశారా అన్న చర్చ ప్రపంచాన్ని పట్టి కుదిపేసింది. కారణం ఈ వైరస్‌ను చైనాలోని వూహాన్ ల్యాబ్ నుండి ప్రపంచంపైకి వదిలిపెట్టారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, దీనికి కారణం చైనా కాదు... చైనాలోని అమెరికాకు చెందిన మాంసం ఎగుమతి కర్మాగారాలేనని మరో వర్గం ఆరోపిస్తోంది. రెండు వర్గాలలో ఎవరు చెప్పింది నిజమైనా... ఈ రోగాన్ని ప్రపంచానికి అంటించింది మాత్రం మనుషులేనన్నది అర్థమవుతోంది. అది నిజంగానే నిజం అయితే... అంతకన్నా దుర్మార్గం మరొకటి ఉండదు. ఒకప్పుడు కలరా వణికించింది. మలేరియా భయపెట్టింది. వాటికి వ్యాక్సిన్లు తయారుచేశారు. అటువంటి ఓ కొత్త వ్యాపారం కోసమే కరోనాను కనిపెట్టారా? అది నిజం కాదని అంటే మనసు కాస్త ప్రశాంతంగా ఉంటుంది. కానీ అదే నిజం అయితే మాత్రం చాలా చాలా భయంగానూ ఉంటుంది. భయం... ఇక్కడ రోగం వల్ల కాదు... దాన్ని మనపైకి వదిలిన దుర్మార్గుల వల్ల! కొన్నేళ్లుగా చికున్ గున్యా, డెంగ్యూ జ్వరాలు మన దేశంలో స్వైర విహారం చేస్తున్నాయి. కొన్ని దశాబ్దాల క్రితం వరకు అసలీ రెండు జ్వరాల ఊసే లేదు. అప్పుడు లేని జ్వరాలు ఇప్పుడు కొత్తగా ఎలా పుట్టుకొచ్చాయి అని కొందరి ప్రశ్న. కొంపదీసి ఈ జ్వరాలను వ్యాప్తి చేసే దోమలను కూడా ఎవరో ఉత్పత్తి చేసి మానవాళిపైకి వదిలారా? జ్వరాలతో జనం వణుకుతూ ఉంటే... వాటికి మందులు అమ్మి, లాభాలు గడిస్తున్నారా? అని మరికొందరికి మాచెడ్డ అనుమానం. నిజానిజాల సంగతి తరువాత కానీ... ముందుగా అసలీ అనుమానాలు ఎందుకు వస్తున్నాయని అడిగామనుకోండి... ఔషధ వ్యాపారులతో పాటు బడా ఆసుపత్రుల భారీ ధనాశ చూస్తోంటే ఈ లోకంలో ఏదైనా సాధ్యమేనని అనిపించడం లేదా అని మనల్ని ఎదురు ప్రశ్నిస్తారు. కార్పొరేట్ ఆసుపత్రులు ఇంతగా పెరగని కాలంలో... గర్భవతులకు నూటికి నూరు శాతం సాధారణ డెలివరీలే అని ఆ తరం పెద్దవాళ్ళు చెబుతుంటారు. వైద్యవిద్య అంటే ఏమిటో కూడా తెలియని మంత్రసానులు పురుళ్లు పోసి, పండంటి బిడ్డలను కానుకగా ఇచ్చేవారు. తేడా ఎక్కడ ఉందో తెలీదు కానీ... ఆ తర్వాత అవసరం ఉన్నా లేకపోయినా సిజేరియన్ ఆపరేషన్లు పెరుగుతూ వచ్చాయి. ఏడు నెలల గర్భవతి కడుపు నొప్పిగా ఉందని ఆసుపత్రికి వస్తే చాలు... సిజేరియన్ చేయకపోతే తల్లికీ బిడ్డకీ ప్రమాదమేనని చెప్పి ఆపరేషన్లు చేసేస్తున్నారు అని కొందరి తీవ్ర ఆరోపణ. నిజానికి, అటు రోగాల్లోనూ, మందుల్లోనూ కొత్త కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. అవి అన్నీ కచ్చితంగా చెడ్డవి కావు. అలా గంపగుత్తగా ఓ ముద్ర వేసేయడం సరైనది కాదు. నయం కాని రోగాలకు కొత్త మందులు ఆవిష్కరించడం శాస్త్రీయ పరిశోధనలో కచ్చితంగా పెద్ద ముందడుగే. కాకపోతే ఆ మందుల అవసరం లేని వాళ్లతో కూడా వాటిని కొనిపించడానికి ప్రయత్నిస్తేనే... తప్పు. అలా చేసే వారే అసలు విలన్లు. ఏ వ్యాపారాన్నైనా క్షమించవచ్చు కానీ... విద్య, వైద్యం లాంటి విషయాల్లో మాత్రం కాదు. ఇలాంటి అక్రమాలు ఎక్కడ జరుగుతున్నా కనిపెట్టి, కళ్ళెం వేయాల్సింది పాలకులే. 'వైద్యో నారాయణో హరిః' అన్న నానుడి పుట్టిన దేశం మనది. ఇక్కడే వైద్యం అంటే... డబ్బు కోసం జరిగే వ్యాపారం అనిపిస్తే మాత్రం మంచిది కాదు. అందుకే, ఈ రోగాన్ని నయం చేయడమెలాగో అందరూ ఆలోచించాలి. ముఖ్యంగా ప్రభుత్వాలు ఏదో ఒక మందు కనిపెట్టాలి!

# మధిర కాకతీయ కమ్మసంగం ఆధ్వర్యంలో సన్మానం చేసిన రాయపట్నం ఉప సర్పంచ్ పుల్లారావు



మధిర ప్రజా పాలన ప్రతినిధి నవంబర్ 29: కాకతీయ కమ్మసంగం ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి సన్మాన కార్యక్రమంలో తాము అందజేస్తున్నటువంటి కృషిని గుర్తించి ఒక రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి గా తాను సేవాలందించి అధికారులతో మాట్లాడడంలోను ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలోనూ తమను నమ్ముకున్న ప్రజల మరియు సమాజికవర్గ సమస్యలను పరిష్కరించడం లోను తమ ప్రత్యేక కృషిని అందజేస్తూసామాజికవర్గ అభివృద్ధికి తోడ్పడుతున్న రాయపట్నం ఉపసర్పంచ్,రిటైర్డ్ టీచర్ మార్నిడి పుల్లారావు ని కాకతీయ కమ్మసంగం నిర్వాహికులు సన్మానించడం జరిగింది తమ నిబద్ధతను,సేవలను గుర్తించి గౌరవపధంగా సన్మానించిన మధిర కాకతీయ కమ్మ సంగం నిర్వహకులందరికి ప్రతి ఒక్కరికి పేరుపేరున తమ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తా. మీరిచ్చిన ఈ గౌరవానికి లోబడి ఎల్లవేళలా సమాజికవర్గ అభివృద్దిలోను తమను నమ్ముకున్న వారికి సహాయ సహకారాలు అందించడంలోనూ మనస్ఫూర్తిగా కృషిచేస్తానని లిమార్నిడి పుల్లారావుగారులి పేర్కొనడం జరిగింది. ఒకప్పుడు వ్యవసాయరంగం ప్రధాన వృత్తిగా ఉన్నటువంటి కమ్మవారు నేడు ప్రతి రంగంలో అమలాపురం నుండి అమెరికా వరకు సినిమా, ఆతిథ్యం, వైద్యం, విద్య, వ్యాపార,పత్రికలు, మీడియా వంటి అనేక రంగాల్లో కమ్మవారు ప్రవేశించి వ్యక్తులుగానూ, సంస్థల అధిపతులుగానూ స్థిరపడి తమ సత్తా చాటుతున్నారనితాను అభివృద్ది చెందుతూ తనతో ఉన్న నలుగురిని అభివృద్ధి చేసే గొప్ప మనసు కలిగినవారు కమ్మవారని తమని నమ్ముకున్న వారికి న్యాయం చేయగలిగినప్పుడు వచ్చే ఆనందం మాటల్లో వర్ణించలేనదని కమ్మవారి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలియజేసిన తెలుగుతల్లి ముద్దుబిడ్డ కుల మతాలకు భిన్నంగా ప్రతి ఒక్కరు అన్నా అని పిలుచుకునే విశ్వ విఖ్యాత, నట సార్వభౌమ, నటరత్న, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు ఈ సందర్భంగా స్మరిస్తూ.కమ్మ వారి కీర్తిని గొప్పతనాన్ని గుర్చి లిమార్నిడి పుల్లారావు కొనియడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి రామనాథం మల్లాది వాసు చెరుకూరి నాగార్జున రావూర్ను శ్రీనివాస్ కృష్ణ ప్రసాద్ గడ్డం రమేష్ మేడ వెంకటేశ్వర రావు మాజీ శివాలయం చైర్మన్ శ్రీనివాస రావుసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు



## దీక్షా దివస్ ర్యాలీలో టిఆర్ఎస్వి నాయకులు

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి :తెలంగాణ వచ్చుడో – కేసీఆర్ సచ్చుడో అనే నినాదం తో తెలంగాణ రాష్ట్ర సాధనకోసం 2009 నవంబర్29 న కేసీఆర్ గారు అమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దీక్షకు దిగి తన ఉక్కు సంకల్పాన్ని చాటి చెప్పిన రోజు దీక్షాదివస్. ఈ సందర్భంగా... ఇబ్రహీంపట్నం బస్టాండ్ నుండి పెద్దచెర్వుకట్ట పై ఉన్న అమర వీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించి అమరవీరుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన టిఆర్ఎస్వి యువజన, విద్యార్థి విభాగం నాయకులు. అనంతరం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన టిఆర్ఎస్వి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జెర్కొని రాజు, టిఆర్ఎస్వి ప్రధాన కార్యదర్శి మైలారం విజయ్ కుమార్, నోముల వార్డు సభ్యులు, యువజన విభాగం కోశాధికారి చింతకింది విరేశ్ ముదిరాజ్, 6వ వార్డు అధ్యక్షుడు సొప్పరి కరుణాకర్, టిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు నిమ్మల ప్రసాద్ గౌడ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కొంద్రు మహేష్, మండలం ఉపాధ్యక్షుడు కొంకణి విజయ్ కుమార్, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు ఆమంచ రంజిత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే 131వ వర్ధంతి




ఇబ్రహీంపట్నం అక్టోబర్ 29ప్రజాపాలన ప్రతినిధి.పురస్కరించుకొని యాచారం మండలంలో కొత్తపల్లి గ్రామంలో విద్యార్థి, యువజన సంఘం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. భారతదేశం మొదటి సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే గారికి ఘనంగా నివాళులు అర్పిస్తున్న ఈ కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు విప్లవ్ కుమార్, డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి కంబాలపల్లి సైదులు, గ్రామ ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు శివ ప్రసాద్,శ్రీకాంత్,ప్రజా సంఘం నాయకులు జంగయ్య, శివ,మరియు సత్యనారాయణ,రమేష్, కృష్ణ,మొగిలయ్య,యాదయ్య, యాదగిరి, జంగయ్య, ప్రశాంత్, జంగయ్య రాజు,శివ, శంకర్, విద్యార్థి యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జోగన్ పల్లి లో మహాత్మా జ్యోతిరావు పూలే 131వ వర్ధంతి సందర్భగా ఘన నివాళులు



కోరుట్ల, నవంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి):కోరుట్ల మండలం జోగన్ పల్లి గ్రామం లో ఆదివారం రోజున జ్యోతిరావు పూలే 131 వ వర్ధంతి సందర్భంగా పులే చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామాజిక సాంఘిక విప్లవకారుడు,తన భార్య సావిత్రిబాయి పూలే కి చదువు నేర్పి,బడుగుల కోసం పాఠశాల ప్రారంభించి,విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమని తెలిపిన మహనీయుడు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురువుగా భావించిన మహాత్మ జ్యోతిరావు పూలే 131 వర్ధంతి సందర్భంగా ఆయనకు సామాజిక విప్లవ జోహార్లు తెలిపారు. చిన్న వయసు నుండి జ్యోతిరావు పూలే కు పుస్తక పఠనం అంటే ఆసక్తి ఎక్కువ పూలే బాల్యంలోనే మానవ హక్కుల ప్రాథమిక సూత్రాలపై జ్ఞానాన్ని సంపాదించారు. 13 ఏళ్ల వయసులోనే జ్యోతిరావు పూలేకు 9 సంవత్సరాల సావిత్రి తో వివాహం జరిగింది. పూలే 18 ఆగస్టు నెలలో బాలికల కోసం ప్రత్యేక పాఠశాలను స్థాపించారు. పాఠశాలలో అన్ని కులాల వారికి ప్రవేశం కృతజ్ఞులతో బోధించడానికి ఉపాధ్యాయులు ఎవరు ముందుకు రాలేదు. చివరకు అతని భార్య సావిత్రి పిల్లలకు పాఠాలు బోధించారు. పూలే ఆ కాలంలో వితంతు పునర్వివాహాలు గురించి ఎంతో చైతన్యం తీసుకువచ్చారు. పూలే కులం పేరుతో తరతరాలుగా అణచివేతకు గురవుతున్న బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారు.కుల వివక్షకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారు. భారతదేశంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా కోట్లాది ప్రజానీకం కోసం పేద అణగారిన ప్రజల హక్కుల కోసం పోరాడాడు.1873 సెప్టెంబర్ 24న పూలే తన అనుచరులతో కలిసి ఇ దిగువ కులాల ప్రజలకు సమాన హక్కుల పోరాటానికి సత్యశోధక సమాజాన్ని ఏర్పాటు చేశారు. సమాజం కోసం ఎన్నో మంచి పనులు చేసిన జ్యోతిరావు పూలే 1890 నవంబర్ 28వ తేదీన ఆయన తుది శ్వాస విడిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుంపల నర్సు రాజ నర్సయ్య,ఉప సర్పంచ్ బద్ధం తిరుపతి రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఎల్పుల అంబేద్కర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు శివ రాములు,మెండే అంజయ్య,పోతవేని రాజేశం,ముత్యపు రాజశేఖర్, జుపతి నరేందర్, ఇంద్రాల హరీష్, ఇంద్రాల అశోక్, పోతుగంటి గణేష్, శ్రీకాంత్, నవీన్,గంగాధర్,సతీష్,వెంకటేష్ తదిదరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామ సర్పంచ్ కు సన్మానం



కొడిమ్యాల, నవంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి):డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాల సంఘం ఆధ్వర్యంలో మండల సర్పంచులఫోరం అధ్యక్షులు పునుగోటి కృష్ణ రావు ను ఘనంగా సన్మానించడం జరిగింది. మైసూర్ లో జరిగిన జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం హిమ్మత్ రావు పేట గ్రామ సర్పంచ్ కృష్ణా రావు ఎంపిక కావడంపట్ల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షులు కాయిత ఆనందం, ఉపాధ్యక్షులు బండి నర్సయ్య, నాయిని అంజయ్య నాయిని అర్జున్ ,కాయిత రాజు శేఖర్ హరీష్, రాకేష్ ,ప్రదీప్ ప్రశాంత్ ,యుగేందర్, నరేష్ ప్రమోద్ మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## గోవా టూర్ ను ప్రారంభించిన డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు..




తల్లాడ, నవంబర్ 29 (ప్రజాపాలన న్యూస్):ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా తల్లాడ మండల ఎంపీటీసీలు గోవా బాట పట్టారు. ఈ మేరకు తల్లాడ మండల ఎంపీటీసీలు అందరూ గోవా టూర్ కు సన్నద్ధమై తరలివెళ్లారు. సోమవారం గోవా వెళ్లే బస్సును ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు జెండా ఊపి ప్రారంభించారు. తల్లాడ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, తల్లాడ సొసైటీ చైర్మన్ రెడ్డం వీరమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీలు అందరూ ఏకమై గోవా టూర్ కు తరలి వెళ్లారు. అనంతరం డీసీఎంఎస్ చైర్మన్ రాయల జిల్లా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గోవా టూర్ కు తరలించినట్లు తెలిపారు. వచ్చే డిసెంబర్ 10వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ కార్యక్రమం ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు దుగ్గిదేవర వెంకట్ లాల్, టిఆర్ఎస్ జోన్ చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు(జీవీఆర్), సరికొండ కస్తూరిరాజు, తల్లాడ మండల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ఉప్పల్లో డివికె కన్స్రక్షన్స్ కార్యాలయం ప్రారంభం



మేడిపల్లి, నవంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :ప్రతి వ్యక్తికి సొంత ఇల్లు ఒక కల, ఆ కల నెరవేర్చుకోవడం ఈ రోజుల్లో కొందరికి కష్టమైన పని అలాంటి వారి కోసం ఆకర్షణీయమైన ఇంటి ప్లాన్, నిర్మాణాల కోసం, అర్బన్ ప్లాన్ కోసం ఉప్పల్లో డివికె. కన్స్రక్షన్ కంపెనీ కొలువుతీరింది. ఉప్పల్ ప్రధాన రహదారిలో ప్రజాదర్బార్ శర్మ కాంప్లెక్స్ లో సోమవారం డివికె కన్స్రక్షన్స్ కార్యాలయాన్ని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలలో సివిల్ స్ట్రక్చరల్ ఇంజనీర్ పనులకోసం ఈ ప్రధాన కార్యాలయంను ఏర్పాటు చేశామని సంస్థ ఎం.డి. డివి. కిరణ్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ తక్కువ బడ్జెట్ లో విలువైన నిర్మాణం ఎలా? అన్నది చాలా మంది అనుకుంటుంటారు. అలాంటి వారికి చక్కని పరిష్కారం చూపడం కోసం మా ప్రయత్నం. ఇప్పటివరకు ఎంతో మందికి మా సేవలు అందించాం. తెలుగు రాష్ట్రాలలో అన్ని ప్రాంతాలలో మా సేవలు అందిండానికి సిద్దంగా ఉన్నామని తెలిపారు.

## ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు కరోనా కొత్త రూపం ఒమిక్రాన్ వేరియంట్ పై అవగాహన కార్యక్రమం



మేడిపల్లి, నవంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : కరోనా కొత్త రూపం ఒమిక్రాన్ వేరియంట్ వస్తున్నదని కావున ప్రజలందరూ తప్పని సరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉప్పల్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్లు నర్సింగ్ యాదయ్య, కాశీ విశ్వనాథ్ లు సూచించారు. ఈ మేరకు రాచకొండ పోలీసు ఉన్నతాధికారుల అదేశం మేరకు ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు ఉప్పల్ చౌరస్తాలో వాహనదారులకు, ప్రయాణికులకు కొత్తగా పుట్టుకొస్తున్న కరోన కొత్త వేరియంట్ ఒమిక్రాన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్లు నర్సింగ్ యాదయ్య, కాశీ విశ్వనాథ్ లు మాట్లాడుతూ కరోనా కొత్త వేరియంట్ రూపంలో విజృంభిస్తున్నదన్న నేపథ్యంలో ఇంటి నుండి బయటకు వెళ్లేవారు, వాహనాదారులు, ప్రయాణికులు ప్రతి ఒక్కరు విధిగా మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటిస్తూ, తరచూ శానిటైజర్ తో చేతులు శుభ్రం చేసుకోవడం చేసుకోవాలన్నారు. మాస్కులు ధరించని వారిపై సెక్షన్ 51 మరియు 60 డిజాస్టర్ మేనేజ్ మెంట్ ఆక్ట్ 2005 ప్రకారం రూ1,000/- జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యస్.ఐ. కృష్ణస్వామి, ఏ.యస్.ఐ. శ్రీనివాసరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సరీ ని పరిశీలించిన ఎంపీడీఓ



ఎర్రుపాలెం నవంబర్ 28 ప్రజా పాలన ప్రతినిధి:మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ పంచాయతీ లో ప్రభుత్వ స్థలం లో ఏర్పాటు చేసిన నర్సరీ ని ఎంపీడీఓ అశోక్ పరిశీలించారు. అనంతరం జరుగుతున్న పనులను పరిశీలించి తీసుకోవలిసిన జాగ్రత్తలు గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూరపాటి సుందరమ్మ, ఉప సర్పంచ్ అయిలూరి నాగిరెడ్డి,సూపర్డెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఓ నాగరాజు, ఈసీ విజయ్, సెక్రటరీ కె శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## దళితుల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

### మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మ్యాదరి శ్రీహరి




జగిత్యాల, నవంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి): దళితుల ఐక్యత తోనే రాజ్యాధికారం సాధ్యం అవుతుందని మాల మహానాడు జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మ్యాదరి శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో మాలమహానాడు నూతన జిల్లా ఉపాధ్యక్షుల నియామకం జరిగింది. ఈ సందర్బంగా జిల్లా ఉపాధ్యక్షులుగా రాయికల్ మండలం కిష్టం పేట్ కు చెందిన జాన గోపి, గొల్ల పెల్లి మండలం రాపెల్లే గ్రామానికి చెందిన కల్లు అరుణ్ కుమార్ లను నియమిస్తూ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పు వెంకట రమణ, జిల్లా అధ్యక్షులు మ్యాదరి శ్రీహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చింత కుంట్ల గంగాధర్, జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షులు కోడిపెల్లి సురేష్ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జీ. చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు తాళ్ళ పెల్లి రవి పిలుపు మేరకు ఈ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ఈ సందర్బంగా జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ దళితులు అంత ఒక్కతాటిపైకి వచ్చి ఐక్యంగా ఉన్నప్పుడే రాజ్యాధికారం సాధ్యం అవుతుందన్నారు. చట్ట సభల్లో వర్గీకరణ అంశం వీగిపోయిన , దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన కొందరు తమ రాజకీయ పబ్బం కొరకు దళితులను విడదీసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి కుట్రలను మాల మహానాడు జిల్ల శాఖ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికే దళితులపై, అంబేద్కర్ విగ్రహాలపై ధ్వంసం కొనసాగుతుందని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలని శ్రీహరి డిమాండ్ చేశారు. దళితుల ఐక్యత తోనే హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 5-10వ తేదీ వరకు జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు నాయకులు అరికెల్ల జగన్, జక్కుల అరవింద్, సూద్దాల దినేష్, జంగ పవన్ కుమార్, బాసమల్ల సురేష్, జాగిరి ప్రశాంత్, భోధనపు జగదీశ్, రాసమల్ల రాకేష్, పోడేటి ఈశ్వర్, మహంకాళి శివ కుమార్, జంగ సతీష్, గోడిసేల సందీప్ తదితరులున్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మారిశెట్టి వెంకటేశ్వరరావు..





పాలేరు నవంబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి :ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నేలకొండపల్లి గ్రామంలో కందికొండ శ్రీనువాసరావు జానకిసుందరి ల కుమారుడు సాయి శ్రీహర్ష ఎదీపిక ల వివాహ మహెూత్సవానికి హాజరై వధూవరులను ఆశ్శీరదించిన మున్నూరు కాపు సంఘం పాలేరు నియోజకవర్గ కోఆర్డినేటర్ మారిశెట్టి వెంకటేశ్వరరావు, నేలకొండపల్లి మండల నాయకులు తోట శ్రీను, కందికొండ శ్రీనువాసరావు,కందికొండ సత్యనారాయణ, బాజా నాగేశ్వరరావు, ఏనుగులు శ్రీనివాసరావు,కందికొండ సరిత, మిట్టపల్లి లక్ష్మీ, తదితరులు పాల్గొని సాయి శ్రీహర్ష – దీపిక లను ఆశ్వీరదించినారు.

# కలగానే మారుతున్న 30 పడకల ఆస్పత్రి

కాగజ్‌నగర్, నవంబరు 28, ప్రజా పాలన ప్రతినిధి : కాగజ్‌నగర్ వాసులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎల్లాగౌడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం పక్కనే 2016లో రూ. 4కోట్లతో 30పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. ఆశయం బాగానే ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారు. కొత్త భవనం నిర్మాణ ప్రక్రియ పూర్తిగా రెండేళ్లలోనే పూర్తి అయ్యే అవకాశాలున్నప్పటికి కూడా నిధులు విడుదల జాప్యం, ఇతర కారణాలు వెరసి పనుల్లో ఏ మాత్రం పురోగతి లేని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ కూడా ఇంతవరకు పూర్తి



కాలేదు. ప్రస్తుతం వైద్య చికిత్సలను కాగజ్‌నగర్ ఎల్లాగౌడ్ తోటలోని పీహెచ్‌సీలోనే కొనసాగిస్తున్నారు. ఈ భవనం పూర్తిగా శిథిలమైంది. తరుచూ పెచ్చులూడి కింద పడుతున్నాయి. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనంలోనే ప్రస్తుతం వైద్యసేవలను అందిస్తున్నారు. ఈ భవనం పూర్తిగా శిథిలమై ఉంది. కూలేందుకు కూడా సిద్ధంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసిందంటే చాలు పూర్తిగా పెచ్చులూడి కింద పడుతున్నాయి. గతంలో పలుమార్లు పేషంట్‌లతో పాటు సిబ్బందిపై కూడా పడ్డాయి. 12గదులుండగా, ప్రతీ గదిలోనూ స్లాబ్ పెచ్చులూడి కింద పడుతోంది. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వస్తోందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి 30పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అంతా కోరుతున్నారు. కాగా అత్యవసరంగా ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలో వివిధ శాఖలను కొత్తగా నిర్మిస్తున్న 30పడకల ఆస్పత్రిలోకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయాశాఖల్లో ఉన్న వివిధ సామాన్లను కూలీలతో తరలిస్తున్నారు. కొత్త భవనంలో కరెంటు సౌకర్యం లేకపోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసి విధులు నిర్వహించేందుకు అంతా రంగం సిద్ధం చేస్తున్నారు. రెండేళ్లుగా కొవిడ్ వ్యాప్తి ఉండడంతో సిబ్బంది ఆరోగ్య సమస్యలు, మరోవైపు భవన సమస్యలతో నరకం అనుభవించారు. తమకు విధులు నిర్వహించాలంటే చాలా కష్టంగా ఉందని పలువురు పేర్కొన్నారు. అలాగే రోగులు కూడా ఇక్కడి వచ్చినప్పుడు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందేవారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవకాశాలున్నప్పటికీ కూడా భవన నిర్మాణ పనుల జాప్యంతో అందరికీ సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి అయ్యేట్టు చూడాలని వివిధ కాలనీ, మండలాల వాసులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండు చేస్తున్నారు.

## ఆర్ వి ఆర్ సిండికేట్ ఆధ్వర్యంలో మండల పూజ



మధిర నవంబర్ 29 ప్రజా పాలన ప్రతినిధి :శ్రీ స్వామి అయ్యప్ప అన్నదాన సేవ సమితి ఆద్వర్యంలో 25వ రోజు జరిగిన అన్నదాన కార్యక్రమానికి దాత శ్రీ వూట్ల వేణుబాబు వారు మరియు వారి కుటుంబానికి స్వామివారి ఆశీసులు ఉండాలని కోరుకుంటున్నము. ఈ మండల దీక్ష కాలంలో జరిగే ఈ అన్నదాన కార్యక్రమానికి మాలాధారులు అందరు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రలు కాగలరు సిండికేట్. సభ్యులు తెలిపారు అనంతరం దాతలకు చిరు సన్మానంచేశారు దాతలు అనంతరం మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా సోమవారం కావడంతో స్వామి అయ్యప్ప మాల దారులకు అన్నం పరబ్రహ్మస్వరూపం అని అన్నదానం చేయడం వల్లల స్వామి స్వామి కృప మాకు ఉంటుందని దీవెన ఉంటాయి అదేవిధంగ్గా ఆర్ వి ఆర్ సభ్యులందరికీ పేరుపేరునా అభినందించారు అదేవిధంగ్గా రాబోయే కాలములో మరెన్నో సేవా కార్యక్రమాల్ను చేయాలని కోరారు ఈ కార్యక్రమాల్లో గోపి జగదీష్ శ్రీకాంత్ భార్గవ్ సాయి వెంకటేశ్వర్లావు సాంబశివరావు రెడ్డి సాంబశివ రావు అయ్యప్ప్ప్పు స్వాములు పాల్గొన్నారులు

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మద్దతు ధర ఏ గ్రేడ్ 1960 , బి గ్రేడ్ 1940 తో ఇబ్రహీంపట్నం మండలం



వెలిమినేడు గ్రామంలో కొనుగోలు కేంద్రాన్నీ మంగళ పల్లి పటేల్ గూడా సహకార సంఘం చైర్మన్ మంచిరెడ్డి మహేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించడం జరిగింది. ఐకెపి కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని తరలించడంతో రైతులకు ఖర్చు మిగిలి మద్దతు ధరతో లాభాలు పొందవచ్చని చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ మంచి రెడ్డి మహేందర్ రెడ్డి , వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి , వైస్ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి , సహకార సంఘం డైరెక్టర్ లు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, డి. యాదయ్య, జమ్మూ శ్రీశైలం, పల్లె శ్రీకాంత్ , డోకురి లింగ రెడ్డి , డోకురి శ్యామ్ సుందర్ రెడ్డి , తొట్ల యాదమ్మ , బూడిద బాల్ రెడ్డి, నిట్టు యాదమ్మ, మక్కపల్లి అంజయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

## వరుణార్చన , అభిషేక మహా హెూమం డిసెంబరు 1న జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 28 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం పెద్దచెరువులో పవిత్ర కార్తీకమాసంలో డిసెంబర్ 1న వరుణార్చన , అభిషేక మహాహెూమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదట ఈనెల 22న ఈ మహాహెూమం నిర్వహించాలని తలపెట్టినప్పటికీ , నాలుగు రోజులపాటు కురిసిన ముసురు వర్షాల కారణంగా



తాత్కాలికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందేనని అన్నారు. డిసెంబర్ 1న ఉదయం 7.00 గంటలనుండి సాయంత్రం 5.00 గంటల వరకు వేదపండితులైన బ్రాహ్మణోత్తములు , ఋత్విక్కులతో ఈ మహాహెూమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు చెప్పారు. గత పదేండ్ల క్రితం వర్షాలకోసం మహా వరుణయాగం నిర్వహించిన స్థలంలోనే , వారుణార్చన చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు , మున్సిపాలిటీలనుండి పెద్దఎత్తున భక్తులు , మహిళలు , ప్రజాప్రతినిధులు , అన్ని రాజకీయ పార్టీలు , వివిధ సంఘాలు, ఆధ్యాత్మిక , భజన మండలుల సంఘాల సభ్యులు , కార్యకర్తలు పాల్గొని , వరుణ దేవుడికి అభిషేకంచేసి , హెూమంలో సకుటుంబ సపరివార సమేతంగా పాల్గొని , స్వామివారి తీర్థ ప్రసాదాలు , అన్నప్రసాదం స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావలసిందిగా ప్రతిఒక్కరిని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సత్తు వెంకటరమణా రెడ్డి పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న ఇంటర్ అడ్మీషన్ల గడువు

కాగజనగర్, నవంబర్ 29, ప్రజా పాలన ప్రతినిధి:ఇంటర్మీడియేట్ అడ్మీషన్ల గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనున్నట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా. శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మీషన్లకు చివరి అవకాశంగా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నట్లు స్పష్టం చేసారు. గడువు



తేదీలోగా ప్రైవేట్ మరియు ప్రభుత్వరంగ కళాశాలల విద్యార్థుల గుర్తింపు ఫీజు సైతం చెల్లించాలని అన్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ ఆదేశాల మేరకు మొదటి సంవత్సరం జనరల్ మరియు ఒకేషనల్ గ్రూపుల అడ్మీషన్లకు కేవలం ఈ నెల 30 వ తేదీ వరకు మాత్రమే పెంచడం జరిగిందని అన్నారు. కళాశాలల్లో గతంలో చేరిన వారి ఫోటో, సంతకం తదితర వివరాలను సైతం గడువు లోగా నవీకరించాలని అన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని 11 ప్రభుత్వ కళాశాలలు, 23 ప్రభుత్వ రంగ మరియు 6 ప్రైవేట్ కళాశాలలు మొత్తం 40 కళాశాలలున్నాయని, ఆయా కళాశాలల్లో అడ్మీషన్ పొందాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| జి.వి. శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| భుక్య శ్రీను | బోనకల్ | 86881020885 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| పి.పండు | చేవేళ్ల | 9963293635 |
| గొల్లపూడి దశరధన్ | జిల్లేడు, చౌదరిగూడ | 9951334682 |
| పుప్పాల కిరణ్ కుమార్ | రాజేంద్రనగర్ | 9666603538 |


## కాగజ్‌నగర్ టౌన్ సీఐగా బాధ్యతలు తీసుకున్న కె.రవీందర్



కాగజనగర్, నవంబర్ 29, ప్రజాపాలన ప్రతినిధి : కాగజ్ నగర్ టౌన్ సిఐ గా పనిచేసిన మోహన్ బదిలీ కాగా అతని స్థానంలో లో కొత్తగా టౌన్ సిఐ గా కె.రవీందర్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. గతంలో రవీందర్ కాగజనగర్ రూరల్ ఎస్ఐ గా పని చేశారు. కె.రవీందర్ మాట్లాడుతూ కాగజనగర్ లో శాంతిభద్రతలు కాపాడుతానని మరియు అక్రమ దందాలపై ఉక్కుపాదం వహిస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని ఏమైనా సమస్యలు ఉంటే న్యాయం జరగకపోతే స్వయంగా కలిసి వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజలు కలిసి మెలిసి సామరస్యంగా ఉండాలని పోలీసులకు సహకరించాలని తెలిపారు.

## త్వరలో ఉప్పల్ భరత్ నగర్లో సీసీ రోడ్లు డ్రైనేజీ పనులు ప్రారంభోత్సవం

మేడిపల్లి, నవంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ డివిజన్ భరత్ నగర్లో త్వరలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోనున్నట్టు స్థానిక కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి సోమవారం భరత్ నగర్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలవాసులు స్థానికంగా



రోడ్లు, డ్రైనేజీల సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. స్థానిక సమస్యలపై స్పందించిన రజితపరమేశ్వర్ రెడ్డి త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టనున్నట్టుగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ వసంత, జలమండలి మేనేజర్ సత్యనారాయణ ,భసం రఘునాథ్ రెడ్డి, వేముల నర్సింహా రెడ్డి ,బింగి రవి గౌడ్ ,సల్ల ప్రభాకర్ రెడ్డి ,బాకారం లక్ష్మణ్ ,ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి ,దేవి రెడ్డి ,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కరోనా సమయంలో ప్రజ్వల హాస్పిటల్ డాక్టర్ విక్టర్ ఇమాన్యుల్ అందించిన సేవలు అమోఘం




మేడిపల్లి, నవంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు కరోనా సమయంలో ప్రజ్వల హాస్పిటల్ డాక్టర్ విక్టర్ ఇమాన్యుల్ అందించిన వైద్య సేవలు అమోఘమని కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి కొనియాడారు. కరోనా మొదటి, రెండవ వేవ్ సమయంలో డాక్టర్ విక్టర్ ఇమాన్యుల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డిలతో కలిసి పీర్జాదిగూడ శంకర్ నగర్ నివాసి సమిరెడ్డి మరియు కాలనీ వాసులు కుతజ్ఞతగా ప్రజ్వల హాస్పిటల్ డాక్టర్ విక్టర్ ఇమాన్యుల్ కు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా తో ఘనంగా సన్మానించారు.

## బిజెపి అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

### పెండింగ్ స్కాలర్ షిప్స్ , బీసీ రుణాలను మంజూరు చేయాలని డిమాండ్




మంచిర్యాల బ్యూరో, నవంబర్29, ప్రజాపాలన :విద్యార్థుల పెండింగ్ స్కాలర్ షిప్స్ , బీసీ రుణాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిజెపి బీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బొద్దున మల్లేష్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద కళాశాలల విద్యార్థుల తో కలిసి ధర్నా చేపట్టారు , ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మూడు సంవత్సరాల నుండి స్కాలర్ షిప్ లు విడుదల చేయకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. గత మూడు సంవత్సరాల సంబంధించి స్కాలర్ షిప్ లు ఇప్పటి వరకు విడుదల చేయకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను, కళాశాల యాజమాన్యలను ఇబ్బందులకు గురి చేస్తుంది అని అన్నారు. అదే విధంగా గతం లో విద్యార్థులకు ఇచ్చే మైంటైనెన్స్ 5 వేల రూపాయలను 3500 కు తగ్గించడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ స్కాలర్ షిప్ లు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోద్దుల మల్లేష్, మొటపలుకుల తిరుపతి, పెద్దపల్లి పురుషోత్తం, అరుముల్ల పోశం, బల్ల రమేష్, డేగ నగేష్, మధవరపు వెంకట రమణ రావు, పట్టి వెంకట కృష్ణ, ముదాం మల్లేష్, గోళ్ళ రాజేష్, దామెరకుంట నరసయ్య, ముదారి శ్రీకాంత్, బండి రజలింగు, కలశాల విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి: రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగాల మహేష్



మంచిర్యాల బ్యూరో, నవంబర్29, ప్రజాపాలన :పార్లమెంట్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగాల మహేష్ అన్నారు. సోమవారం సి సి సి కార్నర్ లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీ జనాభా ఉంటే చట్ట సభలలో రిజర్వేషన్లు లేక పోవడం అంటే బీసీలను రాజకీయ వివక్షకు గురి చేయడమే అవుతుందని అన్నారు. ఇప్పటికైనా బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలలో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి గుమ్ముల శ్రీనివాస్ నస్పూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు దొంగరి లక్ష్మీకాంత్,పట్టణ కార్యదర్శి తోకల మహేష్ తదితరులు పాల్గొన్నారు

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## మా లోకం

అతనితో తెగతెంపులు చేసుకున్నాడు. పెట్టిన పెట్టుబడి వాపసు రాలేదు. ఇక్కడ కుదరదు అని జిల్లా దాటి ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ సమీపంలోని కడెం ప్రాజెక్టు కింద, బొంబాయిలో కలిసి పని చేసిన ముగ్గురు మిత్రులు కలిసి కిరాణా బట్టల షాపు ప్రారంభించారు. చిన్నాన్నతో కలిసి పెట్టినాయన వి.కె. కోటా డాక్టర్‌గా జగిత్యాలలో తర్వాతి కాలంలో ప్రసిద్ధి చెంది పుర ప్రముఖుల్లో ఒకడుగా ఎదిగాడు.

ఏటా సత్యనారాయణ పూజ, శుక్రవారం పూజ, పురుళ్లు, పుట్టువెంట్రుకలు మొదలైన పండుగలకు వెంకటాపురం వెళ్లే వాళ్లం. వెంకటాపురంలో ఈత చెట్లు ఎక్కువ. ఇంటిముందే చెరువు. వేసవిలో ఈత పండ్లు విరివిగా దొరికేవి. ఈత కల్లు వెంకటాపురంలో కల్తీ లేకుండా లభించేది. పండగల్లో ఈత కల్లు, మాంసం వడ్డించే వాళు

నేను మా అమ్మమీద అలిగి వెంకటాపురం వెళ్ళినప్పుడల్లా ఆప్యాయంగా దగ్గరికి తీసేది. పోగానే కాళ్ళకు నీళ్ళిచ్చి మర్యాదలు చేసేది. నేను వచ్చానని స్పెషల్ వంటగా పెసరపప్పు, కోడిగుడ్డు వంటి వంటలు చేసేది. చిన్నాన్న ఉన్నప్పుడు తన వెంట వీధుల్లోకి తీసుకువెళ్ళేవాడు. ఈతకల్లు తాగాలని బలవంతం పెట్టేవాడు. పొద్దున్నే లేచి చెరువుకట్ట వెంట గల ఈతచెట్లకు కల్లు కుండలు విడిపించి తాగితే అది కల్లులా ఉండేది కాదు. తియ్యగా నిమ్మరసంతో చేసిన షరబత్‌లా ఉండేది. అది ఎంత తాగినా పెద్దగా మత్తు వచ్చేది కాదు. దాన్నే నీర అనేవాళ్ళు. చిన్నాన్న ఇంటికి కల్లుబింకి వాడకం పెట్టేవాడు. చుట్టాలు వచ్చినప్పుడు మరో బింకి అదనంగా తెప్పించేవాడు.

చిన్నమ్మ మక్క గుడాలు వేసేది. చిన్నాన్న ఇంటికోడిని కోస్తే చిన్నమ్మ చికెన్ వండేది. అలా కల్లు, గుడాలు, చికెన్ పులుసు, చికెన్ వంట ప్రత్యేకంగా చేసేది. జగిత్యాలకు వచ్చినప్పుడల్లా చిన్నమ్మ అరటిపళ్లు తెచ్చేది. అలా చిన్నమ్మ ఒక పెద్ద అక్కలాగా, ఒక తల్లిలాగా ఎప్పుడూ మా పై ప్రేమ కురిపించేది. మా అమ్మను అపారంగా గౌరవించేది.

అక్క చెల్లెళ్ల మధ్య ఏదైనా వాగ్వాదం వస్తే చిన్ని (చిన్నమ్మ) అప్పుడు మాత్రమే అమ్మతో ఎదురు మాట్లాడేది. అందులో కూడా ఎంతో వినయం. నువ్వు ఇల్లు పంచుకున్నవు కదక్కా, నాకు నాయన ఇది ఇస్తే తప్పా? అని సముదాయించేది.

చిన్నమ్మ గురించి ఒక గొప్ప కావ్యమే రాయవచ్చు. నిండైన మనస్సు, దేనికీ వెలితి పడని గుణం. కుటుంబాన్ని, ఇరుగుపొరుగును, బంధువులను అందరిని ఒక తీరుగా గౌరవించేది. ప్రేమించేది. ఆత్మీయత కురిపించేది. అమ్మ వద్ద కోపం, ప్రేమ రెండూ ఉంటే, చిన్నమ్మ దగ్గర ప్రేమ ఒక్కటే ఉండేది. అందుకని ఎపుడు కోపం వచ్చినా, బాద కలిగినా, అమ్మమీద అలిగినా, బుద్ధిపుట్టి ఎక్కడికైనా పోవాలనిపించినా, చిన్నమ్మ ఇంటికే వెళ్ళేవాళ్ళం. అలా జీవితమంతా చిన్నమ్మ సేవలందిస్తూనే గడిచిపోయింది.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

# నకిలీ సరుకులకు అడ్డాగా మారిన మధిర

## మొన్న నకిలీ చక్ర గోల్డ్ టీ పొడి.. నేడు తలకు రాసుకునే కొబ్బరి నూనె

మధిర నవంబ29 ప్రజా పాలన ప్రతినిధి :మధిర అడ్డాగా నకిలీ సరుకులుఇంకా మనం తినే తినుబండారాలలో ఎన్ని వస్తువులు నకిలీ నమ్ముతున్నారో.ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులు ఇప్పటికే ముగ్గురు వ్యాపారుల పై కేసులు నమోదు చేసిన పోలీసులు.ఏం కొనాలన్నా ఏం తినాలన్నా ఆందోళన చెందుతున్న ప్రజలుఆంధ్రా నుంచి నకిలీవి తెచ్చి తెలంగాణలో అమ్మకాలు. మధిర కేంద్రంగా నడుస్తున్న నకిలీ వ్యాపారాలు.చోద్యం చూస్తున్న సంబంధిత కంపెనీలు, అధికారులు. నకిలీ సరుకుల అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు. మధిరనియోజకవర్గ కేంద్రంలో నకిలీల కలకలం బయట పడటంతో ప్రజలుమరింత భయాందోళనలు చెందుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం చక్ర గోల్డ్ టీ పొడి నకిలీవి తీసుకువచ్చి తక్కువ ధరకు అమ్మకాలు చేపడుతున్న వైనాన్ని టౌన్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు ఈ విషయాన్ని మరవక ముందే మరో నకిలీ కలకలం లేవడంతో ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం సాయంత్రం రాయపట్నం రోడ్లో పల్లపోతు శ్రీను కిరాణా దుకాణంలో పారాషూట్ కొబ్బరినూనె అమ్మకాలు చేపడుతున్న వైనాన్ని టౌన్ ఎస్ఐ సతీష్ కుమార్ చేధించి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దీంతో ప్రజల్లోఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఏం జరుగుతుంది మధిర లో ఏ ఏ వస్తువులు నకిలీ వి తీసుకొచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. ధనార్జనే లాభంగా అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంతమంది వ్యాపారులు ఆంధ్ర రాష్ట్రం లో విజయవాడ గుంటూరు తదితర ప్రాంతాల నుండి నకిలీ వస్తువులను అతి తక్కువ ధరకు తీసుకువచ్చి ఎక్కువ ధరకు అమ్మకాలు




చేపడుతూ అడ్డగోలుగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ డబ్బులు సంపాదిస్తున్నార నే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అందుకు ఉదాహరణ మొన్న చక్ర గోళ్ళు నకిలీ టీ పొడి నేడు పారాషూట్ కొబ్బరినూనె అమ్మకాలు. ఈ పరిస్థితులను గమనించిన ప్రజలు ఇంకా మనం తినే తినుబండారాల వస్తువులలో, ఒంటికి పెట్టుకునే సబ్బుల్లో, ముఖానికి రాసుకుని సుగంధ ద్రవ్యాలలో ఎన్ని నకిలీ ఉన్నాయో..! అనే ఆందోళనకు గురవుతున్నారు. ఏ వ్యాపారీని నమ్మాలి కొంతమంది వ్యాపారులు దేవుడు బొమ్మలు పెట్టి పూజలు చేస్తూ బయట సమాజానికి ఉన్నతమైన వ్యక్తులు గా కనిపిస్తున్నారు. తీరా చూస్తే నకిలీ సరుకులు అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డ తున్నారు. మానవత్వాన్ని మరిచి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కొందరి అక్రమ వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మధిర ప్రాంత ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. కొంతమంది వ్యాపారులు డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకొని నైతిక విలువలు దిగజారి మనుషులు తినే ఆహారాన్ని, వాడే వస్తువులను నకిలీవి తీసుకొచ్చి ఈ విధంగా అమ్మకాలు చేపడుతూ ఎంతమంది ప్రాణాలకు హాని కలిగిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వివిధ వస్తువులు కి సంబంధించిన ఒరిజినల్ కంపెనీ యాజమాన్యాలు స్పందించి మీ వస్తువులను నకిలీ చేసి అమ్మకాలు చేపడుతున్నారో. ఎల్లే లేదా!తెలుసుకోవాలని అదేవిధంగా మధిర కేంద్రంగా జరుగుతున్న నకిలీ వ్యాపారాలపై పోలీస్ అధికారులు, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ఉక్కుపాదం మోపాలని సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నకిలీ సరుకుల బారి నుండి ప్రజలను కాపాడాలని మధిర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## శాంతి నిలయంలో పుష్పాలంకరణ వేడుక



బోనకల్లు నవంబర్ 28 ప్రజా పాలన ప్రతినిధి: సేవ కార్యక్రమాలు చేయడానికి డబ్బులు అవసరం లేదని, సమాజానికి సేవ చేయాలనే ఆలోచన, చిత్తశుద్ధి ఉంటే చాలని శాంతి నిలయం నిర్వాహకురాలు సిస్టర్ ఆల్ ఫ్రీ, గుడిమెట్ల రజిత అన్నారు. మానసిక వికలాంగుల శరణాలయం శాంతి నిలయం నందు గుడిమెట్ల రజిత, మోహన్ రావు దంపతుల దత్త పుత్రిక సోను, మేఘనల పుష్పాలంకరణ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనకల్ లోని శాంతి నిలయం నిర్వాహకురాలు సిస్టర్ ఆల్ ఫ్రీ, గుడిమెట్ల రజిత మాట్లాడుతూ అనాథలు, అభాగ్యులు, వికలాంగులను సమాజం మానవతా దృక్పథంతో ఆదరించాలని కోరారు. ప్రతి కుటుంబం ఒక అనాథ పిల్లల బాధ్యత తీసుకుంటే వారికి అమ్మ నాన్న ఉన్నారన్న ఫీలింగ్ కలుగుతుందని అన్నారు. ప్రపంచం ప్రేమతో నడుస్తుందని ప్రతి ఒక్కరూ ప్రేమతో సేవ చేస్తే భవిష్యత్తులో అనాథ శరణాలయాల అవసరం ఉండదని అన్నారు. సమాజం పట్ల బాధ్యతతో నిరంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచిన గుడిమెట్ల రజితను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శాంతి నిలయం సిస్టర్స్ బిజిలి, మార్తా, మరియ, ప్రేమ, మరియమ్మ, రోస్ లీయ, సంజు, గ్లోరియా, జాలాది జ్యోతి, జాలాది ఉమా, మాదినేని పద్మ, రామిశెట్టి జ్యోతి, బోగి నాగమణి, వడ్లమూడి విజయ, శంకరశెట్టి కృష్ణవేణీ, ఈడుపుగంటి కమారి, బత్తినేని లక్ష్మీ, బోగి శ్రీనివాసరావు, కాకాటి వినోద్ కుమార్, గుడిమెట్ల మోహన్ రావు, గుడిమెట్ల వేంకట రామన్, గుడిమెట్ల వేంకట రోహన్, గుడిమెట్ల వేంకట రోషన్ తదితరులు పాల్గొన్నారు.

## రావినూతల పడమర తండాలో జ్యోతిరావు పూలేకు ఘన నివాళి




బోనకల్, నవంబర్ 29 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని రావినూతల గ్రామం పడమర తండ లోజ్యోతిరావు పూలే 131వ వర్ధంతిని మహిళా సంఘం మరియు గిరిజన యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వామండల ఉపాధ్యక్షురాలు గుగులోతు శారద మాట్లాడుతూ సంఘ సంస్కర్త, విద్యావంతుడు, పేదల పెన్నిధి, సేవాతత్పరుడు మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకై అందరూ కృషి చేయాలని, నేటి సమాజంలో ఉన్న రుగ్మతలను తొలగించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు, జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకురాలు ధరావతు అచ్చమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు ధరావత్ సునీత,గుగులోతు లక్ష్మి, ధరావత్ సీత, గిరిజన యూత్ ధరావత్ నరేష్, భానోతు నరేష్, జొన్నలగడ్డ హేమంత్, ధరావత్ జగన్, ధరావత్ క్రిష్ణ, గుగులోతు సాయి, బానోత్ కార్తీక్, భానోత్ స్వప్న, భానోత్ దుర్గ, ధరావతు తావిరియ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఏర్పాటు తర్వాత శరవేగంగా తెలంగాణ అభివృద్ధి




మధిరనవంబ29 ప్రజాపాలన ప్రతినిధిన మధిర మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ హాస్పటల్ నందునేడు దీక్షా – దివస్‌లి రోజును పురస్కరించుకొని మధిర ప్రభుత్వ హాస్పిటల్ లో ఉన్న పెసెంట్స్ కి %ు=ూ% యువజన విభాగం ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేసిన లిజడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు 2009వ సంవత్సరం నవంబర్ 29న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు %ు=ూ% పార్టీ అధినేత కేసీఆర్ గారు చేపట్టిన లిదీక్షా – దివస్‌లి తెలంగాణ రాష్ట్ర చరిత్రను మలుపు తిప్పిందని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు గారు పేర్కొన్నారు..నేడు దీక్షా – దివస్ ను పురస్కరించుకుని మధిర లోని ప్రభుత్వ హాస్పిటల్ నందు %ు=ూ% పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని అక్కడ ఉన్న పెసెంట్స్ కి పండ్లు అందించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఆ రోజు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కేసీఆర్సచ్చుడో.తెలంగాణ తెచ్చుడో అంటూ అమరణ నిరాహారదీక్ష చేపట్టారని ఆ దీక్షా తెలంగాణ ఉద్యమ గతిని మరియు రాష్ట్ర గతిని మార్చేసిందన్నారు.ఆ దీక్షా ద్వారా కేంద్రం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ గారు సాధించారని కమల్ రాజు గారు గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ,రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గారు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలతో నేడు దేశానికే మన తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా ఉందని ఆయన స్పష్టం చేశారునాడు నేడు ఎప్పుడు తెలంగాణ యావత్ సమాజం కేసీఆర్ గారి వెంటే ఉందన్నారు..ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు తదితరులు మండల టిఆర్ఎస్ నాయకులు రావూరు శ్రీనివాస్ టిఆర్ఎస్ నాయకులువెంకటేశ్వరావ కృష్ణ ప్రసాద్ సీతార్లామరెడ్డి నరసింహ మూర్తి రమేష్లపళ్ళ పోతులప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జమియతే ఓలేమా-యె-హింద్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముస్లింల బహిరంగ సభ



మధిర నవంబర్ 28 ప్రజా పాలన ప్రతినిధిఆదివారం రోజున మధిర పట్టణంలోని జామా మసీదు –మర్కజ్ లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మౌలానా షేక్ ముజాహిద్ వారి అధ్యక్షతన ఖమ్మం జమియతే ఓలేమా– యె–హింద్ ఆధ్వర్యంలో వారి ఆధ్వర్యంలో బోనకల్ మధిర ఎర్రుపాలెం మండలాల ముస్లిం సోదరుల బహిరంగ సభ నిర్వహించడం జరిగినది.ఈ బహిరంగ సభకు సభాధ్యక్షులుగా మౌలానా అబ్దుల్ సత్తార్ సహెబ్, పర్యవేక్షకులుగా మౌలానా షేక్ ముజాహిద్ సాహెబ్ , సభ నిర్వాహకులు ముఫ్తీ మహమ్మద్ ఇస్మాయిల్ ముజాహిరి ప్రవర్తించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ కు చెందిన ఖుతుబుద్దీన్ సహబ్ విచ్చేశారు. ఈ బహిరంగ సభలో ముస్లిం సోదరులను ఉద్దేశించి మౌలానా మహమ్మద్ సయ్యద్ అహ్మద్ ఖస్మి, ముఫ్తీ జలాలుద్దీన్ సహెబ్, ముఫ్తి అబ్దుల్ రావుర్ ఖాన్, మౌలానా హిమాయత్ ఉల్లా సహెబ్ లు ప్రసంగిస్తూ దివ్యఖుర్ఆన్ బోధన కేంద్రాల నిర్వహణ మరియు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు మరియు నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ అల్లాః కోసం కొంత సమయాన్ని కేటాయించాలని, అన్నారు ఈ కార్యక్రమంలో బోనకల్ మధిర ఎర్రుపాలెం మండలాల ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేశారు. బహిరంగ సభ అనంతరం ముస్లిం సోదరులకు భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగినది.

## మీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బీరు సీసాలతో కొట్లాట

బాలాపూర్:నవంబర్28,ప్రజాపాలన ప్రతినిధి : శనివారం రాత్రి దాదాపు



11: 30 నిమిషాల సమయంలో బాలాపూర్ ఎక్స్ రోడ్ లోని వైస్రాయ్ బార్ %డ% రెస్టారెంట్ పార్కింగ్ స్థలంలో కొందరు వ్యక్తులు గొడవపడిన సంభాషణ మీర్ పేట పోలీస్ స్టేషన్ లో చోటు చేసుకుంది. గాయపడిన సయ్యద్ ఉమర్ అనువ్యక్తినీ బీరు సీసాలతో కొట్టారని తను తలకు బలమైన గాయం కావడంతో సయ్యద్ ఉమర్, తన స్నేహితుడు మహమ్మద్ హబిబ్ కలిసి మీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మీర్పేట్ పోలీసులు కేసు నమోదు చేసి అట్టి నిందితులను (1) కొండాపూర్ కు చెందిన రోహిత్ రెడ్డి (27) సాఫ్ట్వేర్ ఎంప్లాయిస్, (2) పటేల్ గూడెంకు చెందిన సాయి కుమార్ (28) ప్రైవేట్ ఎంప్లాయిస్, (3) పటేల్ గూడెంకు చెందిన సందీప్ కుమార్ (32) ప్రైవేట్ ఎంప్లాయ్, (4)పటేల్ గూడెంకు చెందిన జగపతి (38) ప్రైవేట్ ఎంప్లాయిస్, అను వారిపై కేసు నమోదు చేసి, ఆదివారం రిమాండ్ కు తరలించడం జరిగిందని మీర్ పేట ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహేందర్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ దీక్షా దివస్ మేడికొండ కళ్యాణి కిరణ్

మధిర నవంబర్ 29 ప్రజా పాలన ప్రతినిధి :మధిర మున్సిపాలిటీ మడిపల్లి గ్రామం ఏడవ వార్డు కౌన్సిలర్ మేడికొండ కళ్యాణి కిరణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో –కెసిఆర్ సచ్చుడో ' అంటూ నాటి ఉద్యమ నేత నేటి సీఎం కెసిఆర్ రాష్ట్ర సాధన కోసం మృత్యువును ముద్దు పెట్టుకునేందుకు తెగించిన రోజు.దశబ్దాల వలస పాలనకు చరమ గీతం పాడి స్వరాష్ట్ర సాధన కోసం కెసిఆర్ ఆమరణ దీక్షకు దిగిన ఉద్విగ్న సందర్భం. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందు పరచిన ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ రాష్ట్రం మా హక్కు అంటూ నినదించి మహాత్ముడిలా అహింసా మార్గంలో ఉద్యమాన్ని నడిపి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన దీరోదాత్తుడు కెసిఆర్ . ఈ దీక్షా దివస్ సందర్బంగా కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో మరింత కార్య దీక్ష తో అందరమూ కలిసి పనిచేద్దాం అని తెలియ చేసుకుంటూ ముందుకు వెళ్తామని తెలిపారు

## గోవిందాపురం ఏ గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



బోనకల్, నవంబర్ 29 ప్రజా పాలన ప్రతినిధి : మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామం లో పారిశుద్ధ్య కార్యక్రమం సర్పంచ్ బాగం శ్రీను వాసరావు అదర్వం లో యస్ సి కాలనీ లో స్కూల్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను గ్రామ పంచాయతీ సిబ్బంది మల్టీ పర్పస్ వర్కర్ దార సురేష్, మరియు బ్రహ్మయ్య, మౌగలాలిలు తొలగించి స్కూల్ ను శుభ్రపరచడం జరిగింది. అనంతరం సర్పంచ్ భాగం శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కూలు పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల సిబ్బంది కి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోసర్పంచ్ బాగం శ్రీను వాసరావు మరియు గ్రామ పంచాయితీ కార్యదర్శి హిమబిందు , పంచాయతీ సిబ్బంది దారా సురేష్, బ్రహ్మయ్య ,మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



# పుష్ప చివరి స్టేప్ మొదలయ్యింది



అల్లు అర్జున్.. సుకుమార్ ల కాంబోలో రూపొందుతున్న పుష్ప సినిమా విడుదల తేదీ దగ్గర పడింది. అయినా ఇంకా షూటింగ్ ను దర్శకుడు పూర్తి చేయలేదు. ఒక వైపు సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను నిర్వహిస్తూనే మరో వైపు బన్నీ మరియు సమంతలపై ఐటెం సాంగ్ ను మొదలు పెట్టాడు. నేటి నుండి ఆరంభం అయిన ఐటెం సాంగ్ షూటింగ్ ను నాలుగు లేదా అయిదు రోజుల్లోనే పూర్తి చేయబోతున్నారు. సమంత మరియు బన్నీ లపై ఈ ఐటెం సాంగ్ ను చిత్రీకరిస్తున్నారు. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం బాలీవుడ్ స్టార్ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య ఆధ్వర్యంలో ఈ ఐటెం సాంగ్ ను చిత్రీకరిస్తున్నారు. ఐటెం సాంగ్ పై అంచనాలు భారీగా ఉన్న నేపథ్యంలో దేవి శ్రీ ప్రసాద్ మంచి మాస్ బీట్స్ ను ఇవ్వడం జరిగిందట. గణేష్ ఆచార్య చాలా స్పెషల్ మాస్ స్టెప్పులను ఈ పాట కోసం కంపోజ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. సమంత కాస్త హాట్ గానే ఈ పాటలో కనిపించబోతుంది. అల్లు అర్జున్ మరియు సమంత లు కలిసి ఇంతకు ముందు సినిమాల్లో నటించారు. కాని మొదటి సారి బన్నీ కి జోడీగా ఐటెం సాంగ్ లో సామ్ నటించింది. పైగా వివాహ బంధానికి వీడ్కోలు పలికిన తర్వాత సమంత చేస్తున్న ఐటెం సాంగ్ ఇది. కనుక ఈ పాట చాలా స్పెషల్ గా ఉంటుందని అంటున్నారు. సమంత మరియు బన్నీల మాస్ స్టెప్పులతో పాటు మంచి బ్యాక్ గ్రౌండ్ ఇంకా భారీ ఎత్తున సైడ్ డాన్సర్స్ కూడా ఉంటారని అంటున్నారు. ఈ సినిమాను తెలుగు తో పాటు సౌత్ లో అన్ని భాషల్లో మరియు ఉత్తరాదిన కూడా విడుదల చేయబోతున్నారు. అన్ని భాషల్లో కూడా ఆకట్టుకునే కథ తో ఈ సినిమా తెరకెక్కినట్లుగా చెబుతున్నారు. ఇక హీరోయిన్ గా రష్మిక మందన్నా నటించగా కీలక పాత్రలో సునీల్ మరియు ఫాహద్ ఫాజిల్ లు నటించారు. మరో సారి సుకుమార్ చాలా నమ్మకం పెట్టుకుని అనసూయకు కీలక పాత్రను ఇచ్చాడు. ఆ పాత్రను అనసూయ రంగమ్మత్త పాత్రకు ఎలా అయితే న్యాయం చేసిందో ఈ పాత్రకు కూడా న్యాయం చేసినట్లుగానే ఫస్ట్ లుక్ తర్వాత అనిపిస్తుంది. సినిమా భారీ టెక్నికల్ వ్యాల్యూస్ మరియు స్టార్ కాస్టింగ్ తో రూపొందిన నేపథ్యంలో అంచనాలు పీక్స్ లో ఉండి మంచి బిజినెస్ జరుగుతోంది. బన్నీ కెరీర్ లో అత్యధిక ప్రీ రిలీజ్ బిజినెస్ చేసిన సినిమా గా ఇదే నిలిచే అవకాశం ఉంది. విడుదల తర్వాత వసూళ్ల విషయంలో కూడా పుష్ప నే టాప్ లో వుంటుందనే నమ్మకం అంతా వ్యక్తం చేస్తున్నారు.

# అప్పు నా పక్కనే ఉన్నట్లుగా అనిపిస్తుంది



కన్నడ స్టార్ హీరో పునీత్ రాజ్ కుమార్ చనిపోయి నెల రోజులు అవుతుంది. ఇప్పటికి కూడా అభిమానులు ఆయన మరణ వార్త జీర్ణించుకోలేక పోతున్నారు. పునీత్ పేరు ప్రస్థావన వచ్చినా.. ఆయన సినిమాలు టీవీలో వచ్చినా కూడా అభిమానులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. పునీత్ ను ఇంత చిన్న వయసులో కోల్పోవాల్సి వచ్చినందుకు ప్రతి ఒక్కరు బాధ పడుతున్నారు. వారి కుటుంబ సభ్యుల మాదిరిగా కన్నడ సినీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులు గడుస్తున్నా ఆ బాధ ఏమాత్రం తగ్గడం లేదు. అభిమానులే అలా ఉంటే ఇక కుటుంబ సభ్యుల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. పునీత్ రాజ్ కుమార్ సోదరుడు శివరాజ్ కుమార్ తాజాగా ఒక మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఆ సందర్బంగా శివ రాజ్ కుమార్ ఎమోషనల్ అయ్యారు. సాదారణంగానే ఆయన చాలా ఎమోషనల్ అంటూ ఉంటారు. అలాంటిది తమ్ముడి మరణ వార్తను ఆయన తట్టుకోలేక పోయాడు. తమ్ముడితో ఉన్న అనుబంధంను గుర్తు చేసుకుంటూ ఎడుస్తూనే ఉన్నాడు. తాజా ఇంటర్వ్యూలో మరోసారి శివ రాజ్ కుమార్ కన్నీరు పెట్టుకున్నాడు. తమ్ముడు తన పక్కనే నిలబడి ఉన్నట్లుగా... తనతో ఏదో మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తుంది. నా తమ్ముడు ఈ లోకంను వదిలి వెళ్లాడు అంటే నమ్మాలనిపించడం లేదని ఎమోషనల్ అయ్యాడు. శివ రాజ్ కుమార్ మాట్లాడిన ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పునీత్ రాజ్ కుమార్ మరియు శివ రాజ్ కుమార్ లు ఇద్దరికి కూడా కన్నడంతో పాటు సౌత్ భాషల అన్నింటిలో కూడా గుర్తింపు ఉంది. శివ రాజ్ కుమార్ తెలుగు లో ఒక సినిమాను చేయడం జరిగింది. ఇక పునీత్ రాజ్ కుమార్ నటించిన పలు సినిమాలు తెలుగు లో విడుదల అయ్యాయి. చివరి సినిమా ఏకంగా థియేటర్ రిలీజ్ అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ముందు ముందు మరిన్ని సినిమాలను పునీత్ రాజ్ కుమార్ తీసుకు రావాలనుకున్నాడు. కాని అనూహ్యంగా ఇలా జరిగింది. ఆయన తెలుగు అభిమానులు కూడా ఈ పరిణామంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టాలీవుడ్ ప్రముఖులు పలువురు పునీత్ రాజ్ కుమార్ కు శ్రద్ధాంజలి ఘటించేందుకు గాను బెంగళూరు వెళ్లిన విషయం తెల్సిందే.

# భీమ్లా నాయక్ లో నట కిరీటి



పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందుతున్న భీమ్లా నాయక్ విడుదలకు సిద్దం అవుతోంది. సంక్రాంతికి విడుదల కాబోతున్న ఈసినిమాలో కీలక పాత్రలో రానా కనిపించబోతున్న విషయం తెల్సిందే. పవన్ మరియు రానాల మద్య ఉండే సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని.. ప్రతి ఒక్కరిని కూడా ఆకట్టుకునే విధంగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. సినిమాలో పవన్ కు భార్య పాత్రలో నిత్యా మీనన్ కనిపించబోతుంది. ఆమె లుక్ మరియు ఆమె పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని అంటున్నారు. ఇక ఈ సినిమాలో చాలా కీలకమైన పాత్రలో రాజేంద్ర ప్రసాద్ కనిపించబోతున్నాడు. ఆయన ఈమద్య కాలంలో కమెడియన్ గా మంచి పాత్రలను దక్కించుకుని నవ్వించాడు. కాని భీమ్లా నాయక్ సినిమాలో మాత్రం ఆయన పాత్ర చాలా సీరియస్ గా ఉంటుందని యూనిట్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఇప్పటి వరకు రాజేంద్ర ప్రసాద్ నటించిన పాత్రలకు భీమ్లా నాయక్ సినిమాలోని పాత్ర కాలా విభిన్నంగా ఉంటుందని అంటున్నారు. భీమ్లా నాయక్ సినిమాలో పవన్ కళ్యాణ్ మరియు రానాలు ఇద్దరి పాత్రలు కూడా చాలా ఆవేశ పరులు. వారిద్దరితో కనెక్షన్ ఉండే కీలకమైన పాత్రలో రాజకీయ నాయకుడి పాత్ర లో రాజేంద్ర ప్రసాద్ కనిపించబోతున్నాడట. తెగ నవ్వించే రాజేంద్ర ప్రసాద్ ఈ సినిమాలో సీరియస్ లుక్ లో కనిపించబోతున్న నేపథ్యంలో ఆయన సినిమాలో కొత్తగా కనిపించే అవకాశం ఉంది. ఆయన అభిమానులు మరోసారి ఆయన నట విశ్వరూపంను చూస్తారని యూనిట్ వర్గాల వారు అంటున్నారు. భీమ్లా నాయక్ సినిమా చిత్రీకరణ ముగింపు దశకు చేరుకున్నట్లుగా సమాచారం అందుతోంది.

# ఆలియాభట్ పెళ్లి.. మళ్లీ వాయిదా?



బాలీవుడ్ ప్రేమపక్షులు రణబీర్ కపూర్, ఆలియాభట్‌ల పెళ్లి కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఎదురుచూసే కొద్దీ పెళ్లి వెనక్కి వెళ్తూనే ఉంది. అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ డిసెంబర్‌లో ఈ జంట ఒకటి కావల్సి ఉంది. అయితే కొన్ని కారణాల వల్ల వచ్చే ఏడాది ఏప్రిల్–మే నెలలో జరగనుందని బాలీవుడ్‌లో గుసగుసలు వినిపించాయి. అయితే మరోసారి ఈ జంట పెళ్లి వాయిదా పడిందని బాలీవుడ్‌లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా సమాచారం ప్రకారం ఈ జంట పెళ్లి తంతును మరో ఏడాది వాయిదా వేశారని తెలుస్తోంది. బిజీ షెడ్యూల్స్, ఇతర కారణాలతో వచ్చే ఏడాది డిసెంబర్‌లో పెళ్లి డేట్ ఫిక్స్ చేసుకున్నారట ఆలియా – రణ్‌బీర్. అయితే ఇద్దరు కమిట్ అయిన సినిమాలు పూర్తి చేసి డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం ప్లాన్ చేస్తున్నారట. విదేశాల్లో పెళ్లి అంటే ముందు నుంచే ప్రణాళికలు ఉండాలి కాబట్టి.. అన్ని పనులు పూర్తి చేసి కొంత వెకేషన్ తీసుకుని ఆ తర్వాత పెళ్లి చేసుకోనున్నారట. పెళ్లి వాయిదాకు మరో కారణం కూడా ఉంది. ఆలియాభట్ – రణ్‌బీర్ కపూర్ ఇద్దరూ కలల భవంతి వచ్చే ఏడాది మధ్యలో పూర్తి అవుతుందట. అది పూర్తయ్యాక ఇద్దరూ వివాహబంధంతో ఒకటి కానున్నారని సమాచారం.

# ప్రేమలో విఫలమైన కంగనా ..?



వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచే నటి కంగనా రనౌత్. బాలీవుడ్ సెలెబ్రిటీలపై తరచు విమర్శలు చేస్త ఉంటుంది. నెపోటిజంపై గొంతెత్తి పోరాడుతుంటుంది. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను వెల్లడిస్తుంటుంది. " భారత్‌కు స్వాతంత్ర్యం అనేది 2014లోనే లభించింది. 1947లో మనకు భిక్ష మాత్రమే లభించింది " అని కంగన కొన్ని రోజుల క్రితం పేర్కొంది. దీంతో రాజకీయ నాయకులందరూ ఆమెను తీవ్రంగా విమర్శించడం మొదలుపెట్టారు. ఆమెకిచ్చిన పద్మ శ్రీ అవార్డును వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తాజాగా ఇన్‌స్టాస్టోరీస్‌లో ఆమె ఒక పోస్ట్‌ను పెట్టింది. ఆ పోస్ట్ నెటిజన్ల దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తుంది. ఒక కవితను హిందీలో ఆమె రాసింది. " నీ కోసమే నేను జీవించాను. కానీ, నువ్వు నాతో అన్యాయంగా ప్రవర్తించావు " అని ఆమె రాసింది. ఆ కవిత సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండింగ్‌లో నిలిచింది. దీంతో ఆమె లవ్ కెరీర్‌కు బ్రేకులు పడ్డాయని బీ టౌన్ మీడియాలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రేమలో విఫలమైనట్టు బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. ఈ పోస్ట్‌కు కొన్నిరోజుల ముందే " నాకు తల్లి కావాలని ఉంది. నేను చేసుకోబోయే వాడిని మీ అందరికి పరిచయం చేస్తాను " అని కంగనా రనౌత్ పేర్కొనడం గమనార్హం.

# 'ఆర్‌ఆర్‌ఆర్' ట్రైలర్ వచ్చే తేదీ ఖరారు



టాలీవుడ్ పవరేంటో మరోసారి ప్రపంచానికి చాటేలా దర్శకధీరుడు రాజమౌళి రూపొందించిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'. భారీ మల్టీస్టారర్‌గా రూపొందిన ఈ పాన్ ఇండియన్ మూవీ 7 జనవరి, 2022న విడుదల కాబోతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను డిసెంబర్ 3న విడుదల చేయబోతున్నట్లుగా చిత్రయూనిట్ ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన టీజర్స్, పాటలు.. సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చగా.. ట్రైలర్ ఎప్పుడెప్పుడు వదులుతారా? అని ప్రేక్షకలోకం అంతా ఎదురుచూస్తోంది. వారి ఎదురుచూపులను గమనించిన రాజమౌళి.. దీనికోసం ఎక్కువ టైమ్ తీసుకోకుండానే విడుదల తేదీని ప్రకటించారు. చిత్ర ట్రైలర్‌ను డిసెంబర్ 3వ తేదీన విడుదల చేయబోతున్నట్లుగా.. రాజమౌళితో పాటు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్‌లు సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు.



# బెస్ట్ యాక్టర్ ధనుష్

తమిళ స్టార్ హీరో ధనుష్ మరో ప్రతిష్ఠాత్మక అవార్డ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఆయన నటించిన 'అసురన్' సినిమాకిగాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యాడు. గోవాలో జరిగిన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా'తో పాటూ 'బ్రిక్స్ ఫిల్మ్ ఫెస్టివల్' కూడా నిర్వహించటం జరిగింది. అందులో ఉత్తమ నటుడిగా ధనుష్ పురస్కారం దక్కించుకున్నాడు. బ్రిక్స్ అంటే... బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా దేశాల కూటమి. అంతర్జాతీయంగా ఎంతో కీలకమైన 'బ్రిక్స్' తాము ఏటా నిర్వహించే ఫిల్మ్ ఫెస్టివల్‌ని ఈ సారి గోవాలో జరిపింది. అందులో తమ సినిమా 'అసురన్'కిగానూ ఉత్తమ నటుడు అవార్డ్ లభించినట్టు ధనుష్ ట్విట్టర్‌లో తెలిపాడు. "ఇదొక అత్యుత్తమ గౌరవం" అని ఆయన పేర్కొన్నాడు. గతంలో, 'అసురన్' సినిమాకే ధనుష్ జాతీయ ఉత్తమ నటుడు అవార్డ్ కూడా పొందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే చిత్రానికిగానూ 'బ్రిక్స్' అంతర్జాతీయ అవార్డ్ లభించటం విశేషమనే చెప్పాలి...




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989